# వేమన శతక నీతులు...



**ఉప్పు కప్పురంబు ఒక్క పోలిక నుండు**
**చూడ చూడ రుచుల జాడ వేరు**
**పురుషులందు పుణ్య పురుషులు వేరయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఉప్పు, కర్పూరములు రెండూ కూడా చూడటానికి ఒకే విధముగా కనిపిస్తాయి. కానీ పరిశీలించి చూచినప్పుడు వాటి రుచులు, గుణములు వేరువేరుగా ఉంటాయి. ఉప్పు ఉప్పగాను, కర్పూరం కొంచెం ఘటుగాను ఉంటుంది. అదే విధముగా మనుష్యులంతా చూడటానికి ఒకే విధముగా అవయవ లక్షణములు, ఆకారములు కలిగి ఉన్నా కూడా మామూలు మనుషుల కంటే గొప్పవారి లక్షణములను పరిశీలించి తెలుసుకొనగలిగినచో అవి విలక్షణముగా నుండునని భావము.

**అనువుగాని చోట నధికులమనరాదు**
**కొంచెముండుటెల్ల కొదువగాదు**
**కొండ అద్దమందు కొంచెమై యుండదా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** మనకు తగని ప్రదేశములో మనల్ని మనం గొప్పవారమని చెప్పుకోవడం ఎంతమాత్రం మంచిది కాదు. మనకు గల గొప్పతనమును, ఆధిక్యతను ప్రదర్శించకపోయినంత మాత్రాన మన ఔన్నత్యమునకు భంగము కలుగదు. కొండ ఎంత పెద్దదైననూ అద్దములో చూచినపుడు చిన్నదిగానే కనిపించును గదా! అయినంత మాత్రాన చిన్నది అయిపోదు కదా! అలాగే మన గొప్పతనం మనమే చెప్పుకోనంత మాత్రాన మన ఔన్నత్యం తగ్గిపోదు.

**గంగిగోవు పాలు గరిటెడైనను చాలు**
**కడివెడైననేమి ఖరము పాలు**
**భక్తి గలుగు కూడు పట్టెడైనను చాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఓ వేమ! మంచి ఆవు పాలు గరిటెడు అయినను ఉపయోగముగ ఉండును. కాని కడవ నిండా ఉన్న గాడిద పాలతో పనియేమి? భక్తితో పెట్టిన భోజనము కొద్దిగ అయిన చాలునుగదా అని అర్థం.

**నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు**
**తళుకుబెళుకు రాళ్ళు తట్టెడేల?**
**చాటు పద్యములను చాలదా ఒక్కటి**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** వేమ! నిజమైన మంచి నీలము ఒక్కటి ఉన్నా చాలు కదా! అంతేగానీ ఊరక మెరిసెడి గాజురాళ్ళు తట్టెడు ఉన్నను వ్యర్థమే. అలాగే అనేక రసహీన పద్యములు వినేకంటే ఒక్కచాటు పద్యము విన్న చాలును కదా అని భావము.

**అల్పబుద్ధివాని కధికారమిచ్చిన**
**దొడ్డవారినెల్ల తొలగగొట్టు**
**చెప్పు తినెడు కుక్క చెరకు తీపెరుగునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** "బుద్ధి తక్కువవానికి అధికారం ఇచ్చినట్లైతే మిడిసి పాటుతో చెలరేగి ఉత్తములైన వారిని అవమానించి, దూరంగా తరిమి వేస్తాడట. అల్పుల స్వభావమే అంత! వాళ్ల స్వభావం కుక్క స్వభావం వంటింది. చెప్పులు తినే కుక్కకు చెరుకు రుచి ఎలా తెలుస్తుంది? అంటే చెప్పులు తినే కుక్కకు చెప్పుల రుచే తెలుస్తుంది కానీ చెరుకు రుచి తెలియదు కదా అని భావము....

**తల్లిదండ్రి మీద దయలేని పుత్రుడు**
**పుట్టనేమి వాడు గిట్టనేమి**
**పుట్టలేని చెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఓ వేమా! తల్లిదండ్రులపై ప్రేమలేని కుమారుడు పుట్టినను, చచ్చినను ఒకటే. పుట్టలలో పుట్టి ఎవరికి ఉపయోగముల లేక ఆ పుట్టలోనే చచ్చెడు చెదపురుగుల వలె తల్లిదండ్రులపై ప్రేమలేని కుమారుని జన్మ వ్యర్థము కదా! అంటే తల్లి తండ్రుల మీద ప్రేమ, గౌరవం లేని పిల్లలు ఉన్నను లేనట్టే అని అర్థము.

**మేడిపండు చూడ మేలిమై యుండును**
**పొట్ట విచ్చి చూడ పురుగులుండు**
**పిరికివాని మదిని బింకమీలాగురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఓ వేమా! పైకి మేడిపండు ఎర్రగా పండి చక్కగా కనిపించును. దానిని చీల్చి చూస్తే పొట్టలో పురుగులు కనిపిస్తాయి. అలాగే పిరికివాడు పైకి ఎంత గాంభీర్యమును ప్రదర్శించినప్పటికీ లోలోపల పిరికివాడుగానే ఉంటాడు. అంటే పిరికివాని గాంభీర్యమంతా పైపైనే అని భావము.

**వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును**
**చీడపురుగు చేరి చెట్టు చెఱచు!**
**కుత్సింతుడు చేరి గుణవంతు చెఱచురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఓ వేమా! ఓ మహా వృక్షమునకు అడుగు భాగమున చేరిన వేఱు పురుగు ఆ వృక్షమును చంపివేయును. ఒక చీడపురుగు చెట్టును నాశనము చేయును. అట్లే దుర్మార్గుడు మంచివారిని చెడగొట్టును గదా!

**అల్పుడెపుడుఁబల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బల్కు చల్లగాను**
**కంచు మ్రోగునట్టు కనకంబు మ్రోగునా?**
**విశ్వదాభిరామా వినుర వేమ!**

**భావము:** తక్కువ బుద్ధిగలవాడు ఎప్పుడునూ గొప్పలు చెప్పుచుండును. మంచి బుద్ధిగలవాడు తగినంత మాత్రముగనే మాటలాడును. అంటే లేని గొప్పలు చెప్పక తగుమాత్రంగానే మాట్లాడతాడు. అయినా కంచు మ్రోగినంత పెద్దగా బంగారము మ్రోగదు కదా!

**కుండ కుంభ మండ్రు కొండ పర్వత మండ్రు**
**యుప్పు లవంణమండ్రు యొకటిగాదె?**
**భాషలింతె వేఱు పరతత్వ మొక్కటే**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** సంస్కృతంలో కుండను కుంభమని అంటారు. ఉప్పును లవణం అంటారు. కొండను పర్వతం అంటారు. ఇక్కడ భాష మత్రమే వేరు. అంటే కొండను కుంభం అని అన్నా, ఉప్పును లవణం అని అన్నా వాటి అర్థం ఒక్కటే అలాగే అసలు పదార్థం కూడా ఒక్కటే. మీరు రామ అనండి, ఏసు అనండి, నానక్ అనండి కేవలం పేర్లు మార్పే కానీ పరమాత్ముడు ఒక్కడే. భాష వేరైనా భావమొక్కటే. మతాలు వేరైనా మనుష్యులొక్కటే అనే సమతాభావాన్ని పెంచుకోవాలని వేమన చెప్తున్నాడు.

**ప్రియములేని విందు పిండి వంటల చేటు**
**భక్తిలేని పూజ పత్రి చేటు**
**పాత్రమెఱుగని యీవి బంగారు చేటురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** ప్రేమలేని అన్న సంతర్పణము నందు పిండివంటలు వ్యర్థము. అనర్హుడికి దానం ఇచ్చిన అంటే అపాత్రదానం చేసినందువలన బంగారము వన్నె తగ్గిపోతుంది. ఆ రీతిగానే దేవునిపై నమ్మకం లేనప్పుడు ఎన్నో రకాల పూలతో పూజ చేసిన ఉపయోగము లేదు కదా! అటువంటి పూజ వ్యర్థము కదా అని అర్థం.

**విద్యలేనివాడు విద్వాంసు చేరువ**
**నుండగానే పండితుడుగాడు**
**కొలని హంసలకడ గొక్కెరలున్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** విద్యలేని వాడు విద్యాంసుల దగ్గర ఉన్నంత మాత్రాన వాడు ఎప్పటికీ వాద్వాంసుడు కాలేడు. సరోవరంలోని రాజహంసల సమూహంలో కొంగ ఉన్నంత మాత్రాన అది రాజహంస అవుతుందా? కొంగ కొంగే... హంస హంసే... కదా!

**మిరెము గింజ చూడ మీcద నల్లగనుండు**
**కొఱికి చూడ లోనcజుఱుకు మనును**
**సజ్జనులగువారి సారమిట్టుండురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మిరియపు గింజ పైకి చూచినచో నల్లగా యున్ననూ కొఱికి చూచినచో కారముగా మంట కల్గును. ఆ విధముగానే మంచివాడు పైకి చూచుటకు అలంకారములు లేకపోయిననూ, లోపల హృదయము నందు మేథాసంపత్తి నిండియుండునని భావము.

**చంపదగినట్టి శత్రువు తనచేత**
**చిక్కెనేని కీడు చేయరాదు**
**పొసగమేలు చేసి పొమ్మనుటె మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఓ వేమ! చంప తగిన శత్రువు చేతిలో చిక్కినప్పుడు అతనిని చంపక, హాని చేయక మేలు చేసి పొమ్మనుటె మేలు. అదే అతనికి శిక్ష అగును.

**కులములోనొకడు గుణవంతుడండిన**
**కులము వెలయు వాని గుణము చేత!**
**వెలయు వనములోన మలయజంఉన్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఓ వేమ! అడవిలో ఒక్క మంచిగంధపు చెట్టున్నను ఆ అడవి అంతటిని తన సుగంధము వ్యాపింప చేయును. అట్లే వంశములో ఒక్కడు ఉత్తముడు ఉన్నను వాని గుణముల చేత ఆ వంశమంతయు మంచి పేరు పొందును.

**పట్టు పట్టరాదు పట్టి విడువరాదు**
**పట్టెనేని బిగియఁబట్టవలయుఁ**
**బట్టి విడుటకన్న బరగఁజచ్చుట మేలు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** కార్యమునకు ముందు పట్టుదల పట్టరాదు. పట్టుదల పట్టిన తర్వాత అనుకున్నది సాధించే వరకు పట్టువదల రాదు. పట్టుపట్టి విడుచుట కాన్న చచ్చుట మంచిది.

**తప్పులెన్నువారు తండోపతండంబు**
**లుర్వి జరులకెల్ల నుండుఁదప్పు**
**తప్పులెన్నువారు తమ తప్పులెఱుగరు**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** ఎదుటివారి తప్పులను లెక్కించువారు ఈ లోకములో ఎంతోమంది ఉన్నారు. కానీ తనుచేసిన తప్పులను తెలుసుకొనువారు మాత్రం కొందరే ఉంటారు. అయినా ఇతరుల తప్పులెన్నువారు తమ తప్పులను తెలుసుకోలేరు వేమా!

**ఆలి మాటలు విని అన్నదమ్ములఁబాసి**
**వేఱె పోవువాఁడు వెఱ్ఱివాడు!**
**కుక్క తోకఁబట్టి గోదావరీదునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** ఓ వేమ! తన పెండ్లాము మాటలు విని వేరే కాపురము పెట్టువాడు నిజంగా వెర్రివాడు. ఎట్లనగా కుక్క తోక పట్టుకుని గోదావరీ నది దాటుట ఎవరికైనా సాధ్యమా?

**వానరాకడయును బ్రాణంబు పోకడ**
**కానఁబడ దదెంత ఘనునికైన**
**గానఁబడిన మీఁద గలియెట్లు నడచురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** వర్షము వచ్చుట, ప్రాణము పోవుట ఏ మనుజునకైనా తెలియదు. అది తెలిసినచో కలికాలము ముందుకు నడవదు వేమా! అనగా ఎప్పుడు వర్షము వస్తుందో కచ్చితంగా ఎవ్వరూ చెప్పలేరు. అలాగే ఏ మనిషి ప్రాణం ఎప్పుడు పోతుందో కూడా తెలియదు. ఒకవేళ అదే కనుక తెలిస్తే కలికాలము ముందుకు నడవదు కదా!

**చిప్పబడ్డ స్వాతిచినుకు ముత్యంబాయె**
**నీటబడ్డ చినుకు నీటఁగలిసె**
**బ్రాప్తిగల్గు చోట ఫలమేల తప్పురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** స్వాతి కార్తెయందు వర్షపు బిందువు ముత్యపు చిప్పయందు పడినచో అది ముత్యం అవుతుంది. ఒకవేళ అదే వర్షపు బిందువు నీటియందు పడినచో నీటిలో కలసిపోవును. కాబట్టి ప్రాప్తం ఉన్నట్లైతే అదృష్టము ఎక్కడికినీ పోదని భావించు వేమా!

**మాటలాడ నేర్చి మనసు రంజిల జేసి**
**పరగ ప్రియము జెప్పి బడలకున్న**
**నొకరి చేతి సొమ్ములూరక వచ్చునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**<u>భావము:</u>** మంచి మాటలు పలికి, మనసును రంజింపజేసి, ప్రియంగా హితవులు జెప్పి ఇతరులకు ఆనందం కలుగజేసినప్పుడే వారి నుండి ధనాన్ని పొందగలుగుతాము. కనుక సమధుర, సరస సంభాషణ అన్ని వేళలా లాభదాయకం అని తెలుసుకోండి.

**హీనుడెన్ని విద్యలిల నభ్యసించిన**
**ఘనుడుగాడు మొఱకు జరుడెగాని**
**పరిమళములు గర్దభము మోయ ఘనమౌనె**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఎంతటి ఉన్నతవిద్యావంతుడైనా, బహు గ్రంథపారాయణుడైనా మూర్ఖుడు ఎప్పటికీ గొప్పవాడు కాలేడు. సుగంధ పరిమళాలు రాసుకున్నంత మాత్రాన గాడిద ఘనమైనది అవుతుందా? కాదు కదా! గాడిద గాడిదే అవుతుంది కదా!!

**ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల?**
**భాండ శుద్ధి లేని పాకమేల?**
**చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఆత్మశుద్ధి లేని ఆచారము, పాత్ర శుభ్రముగా లేని పాత్రలలో వండిన వంటకములు, అలాగే చిత్తశుద్ధి లేని పూజలు అన్నీ నిష్ప్రయోజనములని భావము.

**తనువు ఎవరి సొమ్ము తనదని పోషించ**
**ధనము ఎవరి సొమ్ము దాచికొనగ**
**ప్రాణము ఎవరి సొమ్ము పాయకుండగ**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఈ శరీరము ఎవరి సొమ్ము? ఈ ధనము ఎవరిది? ప్రాణము ఎవరి సొమ్ము అని పోకుండా నిలపగలము? అంటే మనం పుట్టేటప్పుడు మనవెంట ఏదీ తీసకుని రాలేదు... అలాగే పోయేటప్పుడు మనం తీసుకుని పోయేది ఏది లేదు కానీ మధ్య జీవితం అంతా శరీరాన్ని పోషిస్తూ మంచి మంచి బట్టలు వేస్తూ డబ్బు సంపాదన వెంట పరుగులు తీస్తూ ఉంటాము. కాబట్టి మనిషి తామరాకు మీద నీటిబొట్టులా ఉంటూ జీవితాన్ని గడపాలి. దేవుని స్మరిస్తూ తన జీవితాన్ని జీవించాలే కానీ ఎండమావుల వెంట పరుగులు తీయరాదు అని భావము...

**నీళ్లలోన మొసలి నిగిడి యేనుఁగుఁ దీయు**
**బైటఁ కుక్క చేత భంగపడును!**
**స్థానబల్మిగాని తన బల్మి గాదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** ఓ వేమ! నీళ్లలో ఉన్న మొసలి చిన్నదైనను ఏనుగును కూడా నీటిలోకి లాగి చంపగలదు. కానీ ఆ మొసలి తన స్థానమైన నీటి నుంచి బయటకు వచ్చినప్పుడు కుక్క చేత కూడా ఓడింపబడును. మొసలికి ఆ బలము స్థానము వలన వచ్చిన బలమే కానీ తన స్వంత బలము కాదు.

**జీవిజంపుటెల్ల శివభక్తి తప్పుటే**
**జీవునరసి కనుడు శివుడె యగును!**
**జీవుడు శివుడనుట సిద్ధంబు తెలియరా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

**భావము:** జీవుడికి, శివుడికి మధ్య బేధం లేదు. తరచి చూస్తే జీవుడే శివుడు. శివుడే జీవుడు. ఏ జీవినీ హీనంగా చూడరాదు. జీవిని చంపడమంటే శివభక్తి తప్పడమే. జీవహింసమహాపాపం అన్నారు పెద్దలు.

**ఎరుగనివాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప!**
**యేటివంక దీర్ప నెవ్వరితరమయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** తెలుసుకోవాలనే జిజ్ఞాస గలవారికి తెలియజెప్పడం అందరికీ సులభమే, తాపట్టిన కుందేటికి మూడేకాళ్లు అని వాదించడం మూర్ఖుని సహజ లక్షణం. అలాంటి వాడికి తెలియజెప్పడం ఎవరి తరం కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయడం ఎవరికి సాధ్యమవుతుంది? అలాగే మూర్ఖుడిని కూడా సరిచేయలేము.

**ముష్టి వేపచెట్టు మొదలుగా బ్రజలకు**
**పరగ మూలికలకు పనికివచ్చు!**
**నిర్దయుండు ఖలుడు నీచుడెందులకగు?**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** విషవృక్షమైన ముష్టి అమిత చేదుగా ఉండే వేప కూడా ఔషధరూపంగానైనా లోకానికి ఉపమోగపడుతాయి. కానీ దుర్మార్గుడు సంఘానికి ఏ విధంగానూ ఉపమోగపడడు సరికదా, హాని కూడా చేస్తాడు.

**వంపుకర్రగాచి వంపు తీర్చగవచ్చు**
**కొండలన్ని పిండిగొట్టవచ్చు!**
**కఠినచిత్తు మనసు కరిగింపరాదు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** వంకర కర్రను మంటలో వేడి చేసి తిన్నగా చేయవచ్చు. కొండలను పిండి చేయవచ్చు. కఠినచిత్తుని దయావందునిగా మార్చలేం.

**కనగ సొమ్ములెన్నొ కనకంబుగొక్కటి**
**పసుల వన్నె లెన్నొ పాలొకటియె!**
**పుష్పజాతులెన్నొ పూజయొక్కటె సుమీ**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఆభరణములు వేరైనా బంగారమొక్కటే. పశువుల రంగులు వేరైనా పాలు ఒక్కటే. సుగంధ సంభరిత పుష్పజాతులు వేరైనా చేసే పూజ మాత్రం ఒక్కటే. అలాగే శాస్త్ర పరిజ్ఞనము గల పండితులు వేరైనా జ్ఞానం మాత్రం ఒక్కటే.

**పగలుడుగ సొసలుడుగును**
**పగపుడుగం గోర్కెలుడుగు వడిజన్మంబుల్**
**తగులుడుగు భోగముడిగ్గి**
**త్రిగుణంబును నుడగముక్తి తెరువగు వేమా?**

**<u>భావము:</u>** విరోధాలు లేనప్పుడు ఆశలు ఉండవు. విచరం లేకపోతే కోరికలుండవు. సుఖం నశించినప్పుడు అనురాగం ఉండదు. త్రిగుణాలు నశిస్తేనే ముక్తి కలుగుతుంది.

**మర్మమెఱుగక లేక మతములు కల్పించి**
**యుర్విజనులు దుఃఖ మొందుచుంద్రు!**
**గాజుటింటి కుక్క కళవళపడురీతి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** అద్దాలగదిలో కుక్క దర్పణంలో తన ప్రతిబింబమును చూసి కలతపడి ఏ విధంగా బాధపడుతుందో, అలాగే మూఢ జనులు ఆత్మతత్వం తెలుసుకోలేక, విభిన్న మతాలను కల్పించి, మత మౌఢ్యంలో చిక్కుకుని, ఒకరినొకరు ద్వేషించుకొనుచూ, దుఃఖముతో కాలం గడుపుతున్నారు.

నిజానికి పరబ్రహ్మం ఒక్కటే అని గుర్తించలేని అజ్ఞాన స్థితిలో ఉన్నారు. అది గుర్తించగలిగినప్పుడు అంతా ఆనందమే...

**లోభమోహములను ప్రాభవములు తప్పు**
**తలచిన పనులెల్ల తప్పించనును!**
**తానొకటి దలచిన దైవమొండగుచుండు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** లోభం, మోహం ఉండేవారికి గొప్పతనం ఉండదు. అటువంటి వారు తలచిన పనులు జరగవు. తానొకటి తలిస్తే దైవమొకటి తలచుట సామాన్యం.

**కలిమి కలిగియుండు కఠిన భావము చెంది**
**తెలియలేరు ప్రజలు తెలివిలేక!**
**కలిమి వెన్నెలగతి గానంగలేరయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** సిరిసంపదలు శాశ్వతములని తలచి ధన గర్వంతో కఠిన చిత్తులై, ఎవ్వరినీ లెక్క చేయకుండా కొందరు లోకంలో సంచరిస్తూ ఉంటారు. కానీ ఈ ఐశ్వర్యాలు, సుఖభోగాలు వెన్నెల వలె అస్థిరమని గ్రహించలేక పోవడం ఎంత అజ్ఞానం!

**పనస తొనలకన్న పంచదారలకన్న**
**జుంటితేనె కన్న జున్నుకన్న!**
**చెరకు రసముకిన్న చెలుల మాటలె తీపి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** పనసతొనలు, పంచదార, తేనె, జున్నువీటి అన్నింటి కంటే యువతుల మాటలే మిక్కిలి మధురంగా ఉంటాయి అని భావము.

**నిండు నదులు పాఱునిల్చి గంభీరమై**
**వెఱ్ఱివాగు పాఱు వేగంబొర్లి!**
**అల్పుఁడాఁడు రీతి నధికుండు నాఁడునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** గొప్పనదులు నిదానముగాను, గంభీరముగాను నెట్లు ప్రవహించునో, చిన్న నదులు, వంకలు అతి వేగముగా పారిఎట్లు ప్రవహించునో, అట్లే యోగ్యుడు నిదానముగా గంభీరముగా మాట్లాడును. నీచుడు బడబడ వాగుచూ యుండును.

**పనుల వన్నెవేరు పాలెల్ల ఒక్కటి**
**పుష్పజాతి వేరు పూజ ఒకటి!**
**దర్శనంబులారు దైవంబు ఒక్కటె**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మనుషులంతా ఒక్కటే. పశువులు వేరువేరు రంగులతో ఉన్నప్పటికీ అవి ఇచ్చే పాలు మాత్రం తెల్లగానే ఉంటాయి. అలాగే మనుషులు వివిధ వర్ణాలవారైనా మనషులు ఒకటిగా ఉండాలని ఒకటిగా మసలుకోవాలని అంటాడు వేమన. పువులు వేరు వేరు రంగులతో ఉన్నా – పూజకు ఉపయోగపడడంలో అన్నీ ఒక్కటే గదా!

**పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు**
**మాటకన్న నెంచ మనసు దృఢము!**
**కులముకనన నెంచ గుణము ప్రధానంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** దేవుని పూజలకంటే నిశ్చలమైన బుద్ధి ఉండుట మంచిది. మాటలు చెప్పుట కంటె నిశ్చలమైన మనస్సు కల్గి యుండుట మంచిది. వంశము యొక్క గొప్పతనము కంటే వ్యక్తి యొక్క మంచితనము ముఖ్యము.

**నేరనన్నవాఁడె నేర్పరి మహిలోన**
**నేర్తునన్నవాఁడు నిందం జెందు!**
**ఊరకున్నవాఁడె యుత్తమ యోగిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** తెలివిగల వాడు తనకేమియును తెలియదు అని నిదానముగా మాట్లాడును. ఒకవేళ ఏదైనా విషయము తనకు తెలియునని అనినచో ఇతరులు అతనితో వాదించడం మొదలుపెడతారు. ఈ వాదన వలన అపకీర్తి రావచ్చు. కాబట్టి తెలివిగలవాడు ఋషివలె మౌనముగా యుండును. తెలివి తక్కువ వాడు అన్నియు తెలిసినట్లు నటన చేయుచూ చివరకు అపనిందను పొందగలడు.

**పరనారీ సోదరుఁడై**
**పరధనముల కానపడక! పంచరహిత చారై**
**పరులలిగిన తానలగక**
**పరులెన్నగ బ్రతుకువాడు ! ప్రాజ్ఞుడు వేమా!**

**భావము:** తోటి స్త్రీలను సోదరిలుగా భావించి, పరుల ధనమును సేకరించుట మానివేసి, ఇతరులు కోపగించిననూ తాను కోపగించుకొనక, ఇతరులచే కీర్తింపబడుచూ జీవన విధానము చేయవలెను.

**హీనగుణమువాని నిల్లు సేరనిచ్చిన**
**ఎంతవానికైనను నిడుము గలుగు!**
**ఈఁగ కడుపుజొచ్చి ఇక్కట్లు చేయదా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** చెడ్డవానికి ఆశ్రయమిచ్చినచో, నెంతటివానికైననూ ఆపదలు తప్పవు. ఎలాగంటే కడుపులో ఈగ, పురుగులు ప్రవేశించి బాధ పెట్టు విధముగా చెడ్డవాడు తనకు ఆశ్రయం ఇచ్చిన వానికి ఆపదలు కలుగజేయును.

**పంది పిల్ల లీను పదియు నైదింటిని**
**కుంజరంబు లీను కొదమ నొకటి**
**యుత్తమ పురుషుండు యొక్కడు చాలడా**
**విశ్వదాభిరామ వినుర వేమ**

**భావము:** పంది ఒక్కసారి పదునైదు పిల్లలను కనును. కానీ గొప్పదైన ఏనుగు ఒక పిల్లనే కనును. కాబట్టి పెక్కు సంతానమున కంటే గుణవంతుడగు ఒక్కడు మేలు అని భావము.

**నీళ్ల మీద నోడ నిగిడి తిన్నగ బ్రాకు**
**బైట మూరెడైనcబాఱలేదు!**
**నెలవు తప్పుచోట నేర్పరికొరగాcడు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** పడవ నీటియందు చక్కగా నడచును. భూమిమీద మూరెడైననూ పోజాలదు. అట్లే తన స్థానబలము లేకున్నచో బుద్ధిమంతుడు అయినను అతనిలో ఉన్న మంచిని ఇతరులు గ్రహింపలేరు. కాబట్టి ఎంతటివానికైనా స్థానబలిమి తప్పకుండా అవసరం.

**మాట నిలుపలేని మనుజుడు చండాలు**
**డాజ్ఞ లేని రాజు యథముడండ్రు!**
**మహిమ లేని వేల్పు మంట చూచిన పులి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** లోకమున పల్కిన మాటను నిలుపుకోలేని నీచుడు, ఆజ్ఞను ఇవ్వలేని రాజును అథముడు. మహత్తుడు చూపలేని దైవము మంటను చూచి పారిపోవు పులి వలె యుండును.

**అల్పుడైనవాని కధిక భాగ్యముగల్ల**
**దొడ్డవారిcదిట్టి తొలcగగొట్టు!**
**అల్పజాతి మొప్పె యధికుల నెఱుcగునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** అల్పబుద్ధిగలవానికి సంపద గల్గినచో మంచి వారిని తిట్టి వెళ్లగొట్టును. నీచ కులమున పుట్టినవాడు భాగ్యవంతడైనంత మాత్రాన ఎదుటివ్యక్తిలో మంచిని గ్రహించగల నేర్పరితనం రాదు అని అర్థం. అంటే చుట్టూ ఉన్న మంచివారిని తెలుసుకొనలేడు.

**ఎద్దుకైనఁగాని యేడాది తెల్పిన**
**మాట దెలసి నడచు మర్మమెఱఁగి!**
**మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** బండిలాగు నెద్దుకైననూ ఒక సంవత్సరముతర్ఫీదును ఇస్తే యజమాని మాటలు గ్రహించి నడుచుకుంటుంది. మూఢుడకు మాత్రము ముప్పైఏళ్ళు వచ్చినా తన మూఢత్వాన్ని మార్చుకోడు అని భావము.

**నీచగుణములెల్ల నిర్మూలమైపోవు**
**కొదువ లేదు సుజన గోష్టివలన!**
**గంధమలద మేనికంపదగినయట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** సుగంధభరితమైన చందనాన్ని శరీరానికి పూసుకుంటే దేహానికుండే దుర్గంధం ఎలా దూరమవుతుందో అలాగే సుజ్జన గోష్టి వలన మనలోని చెడు గుణాలన్నీ దూరమైపోతాయి. అందుచేత సదా సజ్జనుల సాంగత్యాన్నే కోరుకోవాలి.

**పాల నీడిగింట గ్రోలుచు నుండెనా**
**మనుజులెల్ల గూడి మద్యముండ్రు**
**నిలువఁదగని చోట నిలువ నిందలు వచ్చు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** కల్లు అమ్మువారింటియందు పాలు త్రాగుచున్ననూ మనుజులు కల్లునే త్రాగుచున్నారని అందురు. ఎట్లనగా కల్లు త్రాగే చోటు అది. అచ్చులనేది త్రాగినా కల్లుగానే భావిస్తారు జనులు సుమా!

**నీళ్లలోన మీను నిగిడి దూరము పారు**
**బైట మూరెఁడైన బారలేదు**
**స్థానబల్మిగాని తన బల్మి కాదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** నీటియందు చేపపిల్ల నెంత దూరమైననూ పోగలదు. భూమి యందు మూరెడైననూ పోలేదు. అట్లే స్థానబలమున్నచో ఎలాంటి విజయమునైనా సాధిచంవచ్చు అని భావము.

**అనువినాశమైన నానంద సుఖకేళి**
**సత్యనిష్టవరుని సంతరించు**
**సత్యనిష్టజూడ సజ్జన భావంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** సత్యనిష్టాపరుడు తన ప్రాణాలు పోగొట్టుకునేందుకు సైతం ఆనందంగా సిద్ధపడతాడు గానీ అసత్యమాడటానికి మాత్రం అంగీకరించడు. అంటే ప్రాణం పోయే పరిస్థితి వచ్చినా అబద్ధం ఆడడు అని అర్థం. అట్లాంటి సత్యవంతుడు సజ్జనుడు, పూజ్యుడు చిర్మసరణీయుడు. దీనికి హరిశ్చంద్రుడ తార్కాణం.

**కులము లేనివాఁడు కలిమిచే వెలయును**
**గలిమి లేని వాఁడు కులము దిగును**
**కులముకన్న భువిని గలిమి ఎక్కువ సుమీ**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** కులము తక్కువవాడు సంపదచే కీర్తి పొందును. భాగ్యము లేనివాడు కులముతో పెట్టుకోడు. జీవన విధానము చూచును. అందుచే కులముకంటే సంపదే ముఖ్యము.

**త్రాడు పామటంచు దాజూచి భయపడు**
**దెలిసి త్రాడనుట దీరు భయము**
**భయము తీరినపుడె బ్రహ్మంబు తానగు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** త్రాడును చూసి పాము అని అనుకుని ఒక్కోసారి మనిషి భయపడతాడు. అయితే అది పాముకాదు త్రాడు అన్న నిజాన్ని తెలుసుకొన్న క్షణంలో భయం తొలగిపోతుంది. భయం తొలగితే ఆనందం కలుగుతుంది. రజ్జు సర్పభ్రాంతి వంటిదే సంసారం. సంసారం భ్రాంతి అనేసత్యాన్ని గుర్తించినవాడు తనే బ్రహ్మమౌతాడు. అందుకే అన్నారు 'ఆనందో బ్రహ్మ'.

**పాలు పంచదార పాపడపండ్లలో**
**జాలబోసి వండcజవికి రాదు!**
**కుటిల మానవులకు గుణమేల కల్గురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** చేదుగల పండ్లలో పాలు పంచదార పోసి వంటకము చేసిననూ చేదుగుణములెట్లు వుండునో, అట్లే మంచి గుణములెన్ని ప్రబోధించిననూ కుటిలుడు దుర్గుణములను వీడదని భావము.

**కులము గలుగువాడు గోత్రంబు గలవాcడు**
**విద్య చేత విఱ్ఱవీగువాcడు**
**పసిడిగల్గువాని బానిస కొడుకులు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మంచి కులము గలవాడునూ, మంచి గోత్రము కలవాడునూ, విద్య చేత గర్వించువాడునూ, ముగ్గురూ సంపద గల వానిని చూచి, ఆశ్రయిస్తారు. ఆతిథ్యము పొందుతారు. వానికి బానిసగా యుంటారని భావము.

**కనియు గానలేఁడు కదలింపఁడా నోరు**
**వినయు వినంగలేడు విస్మయమున**
**సంపదగలవాని సన్నిపాతంబిది**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** కంటితో చూచుచుండియు యథార్థమును తెలుసుకొనలేడు. దేవుని స్మరింపడు. ఆశ్చర్యము కలుగునట్లుగ వినుచుండియు లోక విషయములు తెలుసుకొనుటకు ప్రయత్నించుడు. ధనవంతుల దుష్ట లక్షణములు ఈ విధంగానే ఉంటాయి.

**పూర్వజన్మమందు పుణ్యంబు చేయని**
**పాపి తా ధనంబు బడయలేడు!**
**విత్తమరచి కోయ వెదికన చందంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** పూర్వ జన్మలో ఒక్క పుణ్యకార్యం కూడా చేయకుండా ఈ జన్మలో ధనధాన్యాలతో తులతూగాలని, స్వర్గసుఖాలు కావాలని వాటిని అనుభవించాలని కోరుకున్నంత మాత్రాన అవి లభిస్తాయా? విత్తనమే నాటకుండా పంటకు ఆశ పడటం ఎంత అజ్ఞానమో పుణ్య కార్యాలు ఆచరించకుండా సుఖ భోగాలనూ అష్టైశ్వర్యాలనూ కోరుకోవడం కూడా అంతే అజ్ఞానం.

**మేఁక కుతిక పట్టి మెడచన్ను గుడవఁగా**
**ఆకలేల మను నాశగాక!**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మేక యొక్క మెడ చన్ను పట్టుకుని కుడిచినచో ఆకలి తీరదు. ఎందుకంటే అక్కడినుంచి పాలు లభించవు. అట్లే లోభివానిని అడిగిన కూడా ఎలాంటి ప్రయజనము ఉండదని గ్రహించాలి.

**ఏమి గొంచువచ్చెనేమి తాఁగొనపోవు**
**బుట్టువేళ నరుఁడు గిట్టు వేళ!**
**ధనము లెచట కేఁగు దానెచ్చటికి నేఁగు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** మనుజుడు పుట్టుకతో నేమి తెచ్చెను? చచ్చినచోనేమి తీసుకొనిపోవును? అట్లే ఈ సంపదలు ఎక్కడికి పోవును? తానెక్కడికి పోవును? అని తెలుసుకోడు వేమా!

**ఆశ చేత మనుజు లాయువు గలవాళ్ళు**
**తిరుగుచుందురు భ్రమ ద్రిప్పలేక**
**మురికి భాండమందు ముసురు నీఁగల భంగి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** జనులు ఆశచే ఆయుర్దాయము ఉన్నంత వరకు కోరికలను విడువ లేక తిరుగుచుందురు. ఎట్టనగా దుర్వాసన కుండ యందు ముసురు ఈగల వలె తిరుగుచుందురు.

**నీళ్లలోని మీను నెఱమంస మాశించి**
**గాలమందు జిక్కు కరణి భువిని**
**ఆశ దగిలి నరుడు నాలాగ చెడిపోవు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** నీటియందలి చేప, మంసమును ఆశించి గాలమునకు చిక్కుకొన్నట్లు భూమి యందు ఆశతో నరుడు చేపవలే జీవించి నశించును.

**పెట్టిపోయలేని వట్టి నరులు భూమి**
**బుట్టనేమి వారు గిట్టనేమి**
**పుట్టలోనఁజెదలు పుట్టవా గిట్టవా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** దానధర్మములేమాత్రం చేయనట్టి మనుజుడు పుట్టినా గిట్టినా ప్రయోజనం లేదు. ఎట్లనగా చెద పురుగులు పుట్టుట లేదా? చచ్చుట లేదా? వాటి వలన ఎవరికి మాత్రం ప్రయోజనం ఉంది? అలాగే దాన ధర్మములు చేయునట్టి వారి వలన కూడా ఎలాంటి ప్రయోజనం ఉండదని భావము...

**ఆశకోసి వేసి యనలంబు చల్లార్చి**
**గోఁచి బిగియగట్టి గుట్టుదెలిసి!**
**నిలిచి నట్టివాఁడె నెఱయోగి యెందైన**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

భావము: ఆశను కోసి అగ్నియందు చల్లార్చి తన గోచి బిగియ కట్టి ఈ జన్మ లక్షణములను తెలిసికొని నిలిచినవాడే యతీశ్వరుడు. వాడే యోగి యందురు వేమా!

**కానివానితోడ గలసి మెలఁగుచున్నఁ**
**గానివాని గానె కాంతురవనిఁ**
**దాటి క్రిందఁబాలు త్రిగిన చందమౌ**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** గౌరవము లేని వారితో మనం కలిసి తిరిగితే మనల్ని కూడా గౌరవములేని వాని గానే ప్రజలు భావిస్తారు. అంటే అలాంటి వారితో తిరగడం వలన మనల్ని కూడా గౌరవించరని అర్థం. ఎట్లనగా తాటిచెట్ల క్రింద కూర్చొని పాలు త్రాగుతున్నా కూడా చూసేవారు మనం కల్లుత్రాగుతున్నామనే భావిస్తారు కదా వేమా!!

**తనువదెవరి సొమ్ము తనదని పోషింప**
**ద్రవ్యమెవరి సొమ్ము దాచుకొనcగ**
**బ్రాణమెవరి పొమ్ము పారిపోకను నిల్వ**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఈ శరీరమెవ్వరి సొత్తు? ఈ ధనమెవ్వరిది? ప్రాణము పోకుండా నుండు వాడెవడు? ఇదంతా ప్రకృతి సహజమని గ్రహించ వలయును వేమా!

**చదువు జదువకున్న సౌఖ్యంబులును లేవు**
**చదువు జదివెనేని సరసుండగును!**
**చదువు మర్మమెరిగి చదువగ చూడడము**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** చదువు లేని వారికి సౌఖ్యం లభించదు. చదువుకున్న వాడె సరసుడు. చదువుకోవాలనే అభిలాష గలవాడు విద్యలలోని సారాన్ని, మర్మాన్ని గ్రహించడానికి చదవాలి. వృథా పఠనము వలన ఎలాంటి ప్రయోజనము లేదు.

**విడువ ముడువ లేక కుడువగట్టలేక**
**వెరపులేక విద్యవిధము లేక!**
**వెడల లేనివాని నడపీను గనరాకో**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** సమయం సందర్భాలకూ తగినట్టుగా పట్టు విడుపులు ప్రదర్శించలేని అలౌక్యుడూ, ధనం సంపాదించి కూడా ఆప్తులను ఆదుకోలేని వాడు, లోకానికి, మంచి చెడ్డలకు భయపడనివాడు, విద్యావిహీనుడు, నలుగురిలో కలసి మెలసి మెలగని వాడు, క్రమ పద్ధతి లేనివాడు నడిచే పీనుగుగా పరిగణించబడతాడు.

**ఎరుకలేని దొర నెన్నాళ్లు గొలిచిన**
**బ్రతుకులేదు వట్టి భ్రాంతికాని**
**గొడ్డటావు పాలు గోరితే చేపునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఎండిపోయిన ఆవును పాలు ఇవ్వమంటే ఏ విధముగా ఇవ్వలేదో అట్లే తాను చేయించుకున్న కష్టమును గుర్తించలేని యజమాని వద్ద ఎంతకాలము పనిచేసిననూ వ్యర్థమే. అంటే కష్టము గుర్తించలేని యజమాని దగ్గర పనిచేయడం అన్నది వట్టి ఆవుతో సమానం.

**కల్లలాడువాని గ్రామకర్త యెఱుగు**
**సత్యమాడువాని స్వామి యెఱుగు**
**బెక్కుతిండిపోతుఁబెండ్లామెఱుంగురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** అబద్ధములాడు వానిని గ్రామాధికారి గుర్తించును. నిజము పలుకువానిని దైవము గుర్తించును. తిండిపోతును భార్య గుర్తించును. ఇవిలోకసాధారణ విషయములు వేమా!

**కల్ల నిజములెల్లఁగరకంఠుఁడెఱుగును**
**నీరు పల్ల మెఱఁగు నిజముగాను!**
**దల్లి తానెరుఁగును దనయుని జన్మంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మనుజుడు ఆడే అబద్ధములు, నిజములు ఆ ఈశ్వరునకు తెలుసు. నీరు పల్ల ప్రదేశమునకే పోవును. కుమారుని పుట్టుక తల్లికి తెలుసును వేమా!

**ఉన్నఘనత బట్టి మన్నింతురేకాని**
**పిన్న, పెద్దతనము నెన్నబోరు**
**వాసుదేవు విడిచి వసుదేవునెంతురా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మనిషి ఎన్ని గొప్పగుణాలు కలిగి ఉంటే సంఘంలో అంత గొప్పగా గౌరవిచబడతారు. గొప్పతనానికి వయసుతో నిమిత్తం లేదు. వాసుదేవుడైన శ్రీకృష్ణుడు తన తండ్రి వసుదేవుని కంటే ఎక్కువగా గౌరవించి పూజించబడుతున్నాడంటే దానికి అతని గొప్ప గుణాలే కారణం.

**తనకు గల్గు పెక్కు తప్పులుండగా**
**ఓగు నేరము లెంచు నొరులcగాంచి!**
**చక్కిలంబుcగాంచి జంతిక నగినట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** చెడ్డవాని వద్ద అనేక తప్పులుండగా, వాడు ఇతరుల తప్పులను లెక్కించుచే ఉండును. అంటే స్వయముగా అతనే ఎన్నో తప్పులు చేసినవాడు అయినా కూడా అతను ఇతరుల తప్పులు ఎంచుతూ ఉంటాడన్నమాట. ఇది ఎలా ఉంటుందంటే చక్కిలము చూచి జంతిక నవ్వినట్లు ఉంటుందట...

**మైలకోక తోడ మాసిన తలతోడ**
**ఒడలు ముటికి తోడ నుండెనేని!**
**అగ్రకులజుడైన నట్టిట్టు పిల్వరు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** మురికి గుడ్డలతో గాని, మాసిన శిరస్తుతోగాని, శరీరము నందు దుర్గంధముతో గాని ఉన్నచో అగ్రకులజుడైననూ పంక్తి వద్దకు ఆహ్వానించరు వేమా! అంటే గౌరవముగా చూడరని భావము.

**ఒకనిc జెఱచెదమని యల్లమందెంతురు**
**తమదు చేటెరుcగరు ధరను నరులు!**
**తమ్ము జెరుచువాcడు దైవంబగాడొకో**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** దుర్మార్గులు కొందరు ఇతరులను చెరపుటకు ప్రయత్నిస్తారు. కాని ఆ దుర్మార్గులను చెరపుటకు దేవుడున్నాడని గుర్తుంచుకో వేమా!

**కోతినానరదెచ్చి కొత్త పట్టముగట్టి**
**కొండముచ్చు లెల్ల గొలిచినట్లు**
**నీతిహీనునొద్ద నిర్భాగ్యులుండుట**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** జ్ఞానము లేని వారి వద్ద భాగ్యము లేని వారు ఉండలేరు. ఎట్లనగా కోతిని తెచ్చి నూతనముగా రాజ్యాభిషేకమును చేసి కొండముచ్చులెల్ల వానిని కొలుచునట్లుగా ఉండును.

**ఐదు వ్రేళ్లు బలిమి హస్తంబు పనిచేయు**
**నందొక్కటియు వీడ బొందిక చెడు!**
**స్వీయుడొకడు విడిన జెడుగదా పని బల్మి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** చేతికి ఐదు వేళ్లూ ఉన్నప్పుడే నువ్వు చేయదలచిన పనిని సమర్థవంతంగా పూర్తి చేయగలవు. ఆ ఐదింటిలో ఏ ఒక్క వ్రేలు లోపించినా ఆ హస్తం ఎందుకూ కొరగాదు. అలాగే మనలను ప్రాణసమానంగా భావించి ప్రేమించే ఆప్తుడు ఒక్కడు వీడినా కార్యహాని జరగడమే కాకుండా జీవితంలో అభివృద్ధి సాధించడం కూడా చాలా కష్టం అవుతుంది.

**కానివాని చేతcగాను వీసం బిచ్చి**
**వెంటcదిదుగువాcడె వెఱ్ఱివాcడు**
**పిల్లి తిన్న కోడి పిలిచిన పలుకునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** హీనునకు వడ్డీ కొఱకు డబ్బునిచ్చి వసూలు చేయుటకు వాని వెంట తిరుగువాడు వెఱ్రివాడు. పిల్లిచే తినబడిన కోడి పలకరించితే పలుకునా? వేమా? పలుకదని భావము.

**వానకురియకున్న వచ్చును క్షామంబు**
**వాన గురిసెనేని వఱదపాఱు!**
**వఱద కఱవు రెండు వరుసతో నెఱుగుడి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** వర్షాలు కురవకపోతే దేశములో కరువు కాటకములు వస్తాయి. అలాగే వర్షాలు బాగా కురిస్తే వరదలు వచ్చును. ఈ విధంగా కరువు కాటకాలు, వరదలు రెండు వెంట వెంటవచ్చుట సహజము వేమా!

**పుట్టిన జనులెల్ల భూమిలో నుండిన**
**బట్టునా జగంబు పట్ట దేవుడు!**
**యముని లెక్కరీతి నరుగుచు నుందురు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** భూమిలో పుట్టిన వారందరు గిట్ట యున్నచో చీమ తిరుగుటకు ఖాళీయైననూ ఉండదు. అందుకే యముని లెక్క ప్రకారము అందఱూనూ వాని సన్నిధికి వెళ్లవలసినదేనా సుమా!

**ఎలుక తోలు తెచ్చి యెన్నాళ్లు నుదికిన**
**నలుపు నలుపే కాని తెలుపు కాదు!**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టిన పలుకునా?**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** నల్లగా ఉండే ఎలుక చర్మాన్ని తీసుకుని వచ్చి ఎన్ని రోజులు పాటు ఉతికినా దాని నలుపు పోయి తెల్లగా మారదు. ప్రాణంలేని కొయ్యబొమ్మను ఎంత కొట్టినా దాని చేత పలికించడం సాధ్యం కాదు.

**కోపమునను ఘనత కొంచెమైపోవును**
**కోపమునను గుణము కొరతపడును!**
**కోపమునను బ్రతుకు కొంచెమైపోదును**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** తాను ఎంతటి ఉన్నత విద్యావంతుడైనప్పటికీ, గొప్పవాడైనప్పటికీ కోపానికి బానిసైతే తన గొప్పతనాన్ని కోల్పోతాడు. ఎందుకంటే కోపం వలన మనిషి వివేకాన్ని కోల్పోతాడు. వివేక హీనుడు చేసే పనులు చేసి తద్వారా కష్టాలు కొని తెచ్చుకుంటాడు కనుక కోపాన్ని జయించగలిగితే సునాయాసంగా కీర్తి శిఖరాలను అందుకోగలడు.

**ఎన్ని చోట్లు తిరిగి యేపాట్లు పడినను**
**అంతనియ్యక శని వెంటఁదిరుగు!**
**భూమి క్రొత్తలైన భుక్తులు క్రొత్తలా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఎన్ని స్థలములు తిరిగిననూ, ఎన్ని కష్టములు పడిననూ, ఏమియును పొందనీయక శని వెన్నంటుచూ తిరుగుచుండును. భూమి క్రొత్తయైన భుక్తి క్రొత్తలా?

**ఇమ్ము దప్పువేళ నెమ్మె లెన్నియు మాని**
**కామమెుక్క రీతి కడపవలయు!**
**విజయుఁడిమ్ము దప్పి విరటుని కొల్వఁడా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** పంచపాండవులందు గల అర్జునుడు విరటుని కొల్వుయందు ఉండలేదా? అట్లే స్థానము దప్పినప్పుడు విషయ వాంఛను, దిగులును, విడచి కాలము గడుపవలెను. జీవన మార్గమును అన్వేషించి బ్రతుకు వేమా!

**కర్మమధికమైన గడచిపోవగరాదు**
**ధర్మరాజు దెచ్చి తగనిచోట!**
**గంకుభట్టుఁజేసెఁగటకటా దైవంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** కర్మమును ఎవ్వరునూ దాటజాలరు. దైవము రాజగు ధర్మజుని విరాట రాజు వద్ద కంకుభట్టు బేషమును ధరింపఁజేయలేదా! వేమా... అట్లే విధి బలవత్తరమని గ్రహించుము.

**లక్ష్మి యేలనట్టి లంకాధిపతి పురి**
**పిల్లకోతి పౌఁజు కొల్ల పెట్టెఁ!**
**జేటు కాలమయినఁ జెఱువ నల్పులె జాలు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** రావణ బ్రహ్మ పట్టణమును లక్ష్మిదేవి యేలినది గదా! ఆ లంకను పిల్లకోతుల గుంపు నిప్పు అంటించి కొల్లకొట్టెను. అట్లే ఎంత బలము గలవాడైననూ కాలము కలసిరానిచో నేమియునూ చేయజాలడు వేమా!

**ధనమెచ్చిన మదమెచ్చును**
**మదమెచ్చిన దుర్గుణములు మానక హెచ్చున్!**
**ధనముడిగిన మదముడుగును**
**మదముడిగిన దుర్గుణంబు మానును వేమా!!**

**భావము:** సంపదలు పెరిగే కొద్దీ గర్వం ఎక్కువవుతుంది. గర్వం పెరిగిన కొద్తీ దుర్గుణాలు తప్పనిసరిగా పెరుగుతాయి. సంపదలు తరిగితే గర్వం తనంతట తానే తరుగుతుంది. గర్వం తగ్గిన నాడు దుర్గుణాలు కూడా తగ్గిపోతాయి. దీని భావం దనవంతులందరికీ గర్వం పెరిగి, దుర్గుణాలు పెరుగుతాయని కాదు. ధనమే దుర్గుణాలకు మూలమని గ్రహించంఇ. సంపదలు పెరిగినా కూడా గర్వం, అతిశయం లేకుండా నలుగురికీ ఉపయోగపడుతూ జీవించాలి.

**చిక్కియున్నవేళ సిహంబునైనను**
**బక్కకుక్క కఱచి బాధ చేయు**
**బలిమి లేని వేళఁబంతంబు చెల్లదు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** బలము తగ్గియున్నచో సింహమునైననూ బక్క కుక్క కరచును. ఆ విధముగానే బలము లేనపుడు పంతము చెల్లనేరదు వేమా.

**అలను బుగ్గపుట్టినప్పుడే క్షయమౌను**
**గలను గాంచు లక్ష్మిఁగనుటలేదు**
**ఇలను భోగభాగ్యమీతీరు గాదొకో**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** సముద్రపు అలలందు బుడగ ఏ విధముగా పుట్టుచూ గిట్టుచూ నుండునో అట్లే ఎల్లపుడు భోగ్భఆగ్యములుండవు. ఒకదాని తర్వాత ఒకటి అనుభవిచవలసి వచ్చుచుండును వేమా!

**ఇచ్చువాని యొద్ద నీయని వాఁడున్న**
**జచ్చుగాని యీని సాగనీడఁడు!**
**కల్పతరువు క్రింద గచ్చ పొదున్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** దానము చేయువాని వద్ద లోభియగు బంట్రోతు ఉననచో దానములివ్వనీయడు. కీర్తి తెచ్చిపెట్టనీయడు. ఎట్లనగా కోరికలు ఇచ్చు కల్పవృక్షముల క్రింద ముండ్ల పొద ఉంటే ఆ వృక్ష సమీపమునకు రానివ్వవు కదా! ధర్మాత్ముని వద్ద కూడా లోభి ఉంటే అట్లేయగును.

**గొడ్డుటావు బితుక గుండ గొంపోయిన**
**బండ్లనూడ దన్ను పాలనీదు!**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** గొడ్డుటావు దగ్గరకు కుండను తీసుకునిపోయి పాలు పితకడానికి ప్రయత్నిస్తే పళ్లు రాలేలా తంతుందే కానీ పాలనివ్వదు. అట్లే అవసరమైనపుడు లోభిని సంప్రతించినా లాభము లేదని అర్థము.

**అరయ నాస్తి యనక యడ్డు మాటాడక**
**తట్టు పడక మదిని దన్నుకోక!**
**తనది గాదనుకొని తాఁబెట్టునదే పట్టు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ధర్మము చేసేటపుడు లేదనక, తొందరపడక, మనస్సులో ఇచ్చుచున్నానే అని సంకోచించక పెట్టిన దానమే దానము. దాని ఫలము తొందరగా పొందగలడు వేమా.

**కొంకణంబు పోవ గుక్క సింహము కాదు**
**కాశి కరుగ బంది గజము కాదు!**
**వేఱుజాతి వాఁడు విప్రుఁడు కాలుఁడు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** ఈ దేశము వదిలి ఇతర దేశము వెళ్లిననూ కుక్క సింహము గాదు. కాశీ పట్టణమునకు పంది వెళ్లిననూ ఏనుగు కాదు. ఇతర జాతి వాడు లోకంలో విప్రుడు కాలేడు సుమా అని అర్థం.

**దాత కాని వాని దఱచుగా వేఁడిన**
**వాఁడు దాత యౌనె వసుధలోన!**
**ఆవురు దర్భయౌనె యబ్దిలో ముంచిన**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** దానము సేయని వానిని అప్పుడప్పుడు దానమడగ్గా అతడు దాతయగునా? ఆరిక గడ్డి సముద్రములో ఉంచినను దర్భయగునా? వేమా, ఎన్నటికినీ కాదు. దానబలము తెలియనిచో దాత కాలేదని అర్థము.

**కలుష మానవులకు రాన్పింగారాదు**
**అడుసులోన భాను డడగినట్లు!**
**తేటనీరు పుణ్య దేహమట్లుంఉరా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**<u>భావము:</u>** బురదలో సూర్యుని ప్రతిబింబం ఏవిధముగా కనపడదో, అలాగే పాపచిత్తులకు జ్ఞానం కనిపించదు. నిర్మలమైన తేటనీటిలో సూర్యుని ప్రతిబింబం జ్ఞానం కనిపించదు. నిర్మలమైన తేటనీటిలో సూర్యుని ప్రతిబింబం ఎలా ప్రకాశవంతంగా కనిపిస్తుందో అలాగే పరిశుద్ధమైన మనస్సు గల పుణ్యాత్ములకు మాత్రమే జ్ఞానం గోచరిస్తుంది.

**విత్తము గలవాని వీcపు పుండైనను**
**వసుధలోనcజాల వార్తకెకు!**
**పేదవాని యింట బెండ్లయిన నెఱుగరు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

<u>**భావము:**</u> ధనమున్నవారికి పుండు గల్గిననూ దేశమందు అంతట వార్తలు వ్యాపించును. ధనము లేని పేదవాని ఇంటి యందు పెండ్లియగుచున్ననూ ఎవ్వరునూ చెప్పుకొరు పుమా. అంటే జనం ధనవంతుని గురించి మాట్లాడుకున్నంతగా పేదవాని గురించి మాట్లాడుకోరని అర్థం.

**ఆపద గల వేళ నరసి బంధువుcజూడు**
**భయము వేళ జూడు బంటుతనము!**
**పేద వేళ జూడు పెండ్లాము గుణమును**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

<u>**భావము:**</u> ఆపదలందు బంధువులను చూడుము, భయము గలిగినప్పుడు బంటుతనమును చూడుము. దారిద్ర్యము వచ్చినపుడు భార్య గుణమును చూడుము వేమా!

**మొదట నాశపెట్టి తుద లేదు పొమ్మను**
**పరమ లోభులైన పాపులకును**
**నుసురు తప్పకంటు నుండేలు దెబ్బగా**
**విశ్వదాభిరామ వినుర వేమ**

<u>**భావము:**</u> మొదట అప్పు ఇచ్చెదనని ఆశ పెట్టి పిదప నేదియో నెపముతో లేదు అని చెప్పే లొభులకుసురు ఉండేలు దెబ్బగా తగిలి తీరును.

**ఎండిన మానొకటడవిని నుండిన**
**నందగ్ని పుట్టి యూడ్చును చెట్లన్**
**దండిగల వంశమెల్లను**
**చండాలుండొకడు పుట్టి చదుపును వేమా!**

**భావము:** అడవిలో ఎండిన చెట్టు ఒక్కటి ఉన్నా చాలు. దానిలో పుట్టిన అగ్ని వలన ఆ అరణ్యం అంతా దహించుకుపోతుంది. అలాగే ఎంతటి కీర్తిప్రతిష్టలు గల వంశంలోనైనా ఒక్క దుర్మార్గుడు జన్మిస్తే చాలు వాడి దుర్గుణాల కారణంగా ఆ వంశం పేనుప్రతిష్టలు మంటగలసిపోతాయి.

**మగని కాలమందు మగువ కష్టించిన**
**సుతుల కాలమందు సుఖమునందు!**
**కలిమి లేమి రెండుగల వెంతవారికి**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** ఆడది భర్త యున్నపుడు కషపడినచో కొడుకుల కాలములో సుఖమును పొదును. సంపద, దారిద్ర్యములు రెండునూ ఎంత వారైననూ అనుభవించవలసిందే సుమా.

**ఇంటి ఆలువిడిచి ఇ జాఱకాంతల**
**వెంట తిరుగువాడు వెఱ్ఱివాడు!**
**పంటచేను విడచి పఱిగ యేఱినయట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** లోకం ఇంటిలోని పెండ్లామును వదిలి వేశ్యల వెంట తిరుగువాడు వెర్రివాడు. ఎట్లనగాతన పొలములో పంట ఫలించుచుండగా, ఇతరుల పొలాల్లో పఱిగ కొరకు తిరుగుచున్నట్లుండును వేమా!

**పశుల వన్నె వేరు పాలేక వర్ణమౌ**
**బుష్ప జాతి వేరు పూజ యొకటి**
**దర్శనంబు వేరు దైవంబు ఒకటిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ**

**భావము:** ఆవుల రంగుల వేరువేరైనప్పటికినీ పాల రంగు మాత్రము ఒక్కటే ఉండును. పువ్వుల రకములు, రంగుల వేరువేరుగా ఉన్నప్పటికీ పూజ మాత్రము ఒక్కటే ఉండును. దర్శనములు వేరైనప్పటికీ దైవము కూడా ఒక్కరే కదా వేమా.

**పాలనీరు క్రమము పరమహంస యెఱుంగ**
**నీరుపాల క్రమము నెఱుగ వేల!**
**అజ్ఞుడైనవాడు అల శివునెరుగునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** పాలనీటి గుణమును హంస తెలిసికొనును. నీవు తెలుసు కోజాలవు. అట్లే అజ్ఞానము గలవాడు భగవంతుని తెలిసికోలేడు వేమా.

**పలు తొడవులు వేరు బంగారు మొకటియు**
**బకరగ ఘటము వేరు ప్రాణమొకటి**
**అరయ తిండ్లు వేరు యాకలి ఒకటిరా**
**విశ్వదాభిరామ వినుర వేమ!!**

**భావము:** పలురకాల నగలైననూ బంగారం ఒక్కటే. అలాగే మనుష్యుల శరీరాలు వేరైనా ప్రాణము ఒక్కటే. తినే ఆహార పదార్థాలు వేరైనా ఆకలి ఒక్కటే...

మాట నిలుపలేని మనుజుడు చండాలు
డాజ్ఞ లేని రాజు యధముడండ్రు!
మహిమ లేని వేల్పు మంట చూచిన పులి
విశ్వదాభిరామ వినుర వేమ!!

**భావము:** లోకమున పల్కిన మాటను నిలుపుకోలేని నీచుడు, ఆజ్ఞను ఇవ్వలేని రాజును అధముడు. మహత్తుడు చూపలేని దైవము మంటను చూచి పారిపోవు పులి వలె యుండును.

**శ్రీ రాముని దయచేతను**
**నారూఢిగ సకలజనులు నౌరాcయనగా**
**ధారాళైన నీతులు**
**నోరూరcగc జవులు పుట్ట నుడివెద సుమతీ!**

**భావము:** మంచి బుద్ధి గలవాడా! శ్రీరాముని యొక్క దయవలన నిశ్చయముగా అందరు జనులును సెభాసనునట్లుగా నోటినుండి నీళ్లూరునట్లుగా రసములు పుట్టగా న్యాయమును బోధించు నీతులను చెప్పెదను.

**అక్కఱకు రాని చుట్టము**
**మ్రొక్కిన వరమీని మేల్పు యోహరమునcదా**
**నెక్కినcబారని గుఱ్ఱము**
**గ్రక్కున విడువంగవలయుcగదరా సుమతీ!**

**భావము:** అవసరమునకు పనికిరాని చుట్టమును, నమస్కరించి వేడిననూ కోరిక నెఱవేర్చని భగవంతుని, యుద్ధ సమయమున ఎక్కినప్పుడు ముందుకు పరుగెత్తని గుఱ్ఱమును వెంటనే విడిచి పెట్ట వలయును.

**అప్పిచ్చువాcడు వైద్యుcడు**
**నెప &్పుడు నెడతెగక బాఱు నేఱును, ద్విజుcడున్**
**జొప్పడిన యూర నుండుము**
**జొప్పడకున్నట్టి యూరు జొరకుము సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! ఋణము నిచ్చువాడును, వైద్యుడును, ఎల్లప్పుడును ఆగకుండ ప్రవహించు నదియును, బ్రాహ్మణుcడునుగల గ్రామమందు నివసింపుము, వారు లేనట్టి గ్రామమందు నివసింపకుము.

**ఇమ్ముగఁ జదువని నోరును**
**అమ్మాయని పిలిచి యన్న మడుగని నోరున్**
**దమ్ములఁ బిలువని నోరును**
**గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!**

**<u>భావము:</u>** ఇంపుగా పఠింపని నోరును, అమ్మా! అని పిలిచి అన్నము అడుగని నోరును, తమ్ముడా! అనితమ్ములను పిలువనినోరును, కుమ్మరి వాఁడు త్రవ్విన మన్ను గోయితో సమానం.

**ఇచ్చునదె విద్య, రణమునఁ**
**జొచ్చునదె మగతనంబు, సుకవీశ్వరులున్,**
**మెచ్చునదె నేర్పు, వాదుకు**
**వచ్చునదే కీడుసుమ్ము వసుధను సుమతీ!**

**<u>భావము:</u>** లోకంలో విద్యతో కూడిన ధనమును సంపాదించాలి. యుద్ధభూమి యందు పౌరుషముతో విజయము పొందాలి. కవిశ్రేష్ఠులు మెచ్చుకొనే నేర్పుగల కవిత్వమును వ్రాయాలి. తగవునకు వచ్చు వాక్యములే హానిని కలిగిస్తాయని సుమా!

**ఉపకారికి నుపకారము**
**విపరీతము గాదు సేయ వివరింపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నకఁ జేయువాడె నేర్పరి సుమతీ!**

**<u>భావము:</u>** ఓ సుమతీ! మనకు ఉపకారము చేసిన వారికి తిరిగి ఉపకారము చేయుట మంచి లక్షణము. అంతేగాని అందులో ప్రత్యేకత లేదు. కానీ అపకారము చేసిన వారిపై నెపములెన్నక తిరిగి వారికే ఉపకారము చేయుగలిగినవాడే "నేర్పరి" అనిపించుకొనును.

**ఉత్తమ గుణములు నీచున**
**కెత్తెఱఁగున గలుగనేర్చు వెయ్యడం దా**
**నెత్తిచ్చి కఱగిపోసిన**
**నిత్తడి బంగారుమగునె యిలలో సుమతీ!**

**భావము:** బంగారమునకు సమానమైన ఇత్తడిని తీసుకుని ఎన్నిసార్లు కరిగించిననూ అది బంగారము కాజాలదు. అట్లే నీచునకు ఉత్తమ గుణములబ్బవని భావము.

**ఎప్పుడు సంపద కలిగిన**
**నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్**
**దెప్పలుగఁ జెఱువు నిండినఁ**
**గప్పలు పదివేలుఁ జేరుఁగదరా సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! మనకు ఎప్పుడైతే ఎక్కువగా పంపదలు చేకూరునో, అప్పుడు బంధువులు అధికంగా వచ్చెదరు. అదెట్లనగా చెఱువు నిండా నీరు జేరి అలలు వచ్చునట్టి సమయమున వేలకొలది కప్పలు వచ్చి చేరును కదా! అంటే చెరువులో నీరు నిండినప్పుడే ఎలా అయితే కప్పలు కుప్పలు తెప్పలుగా వచ్చి చేరునో అలాగే సంపద ఉన్నప్పుడే బంధువులు వచ్చి చేరుదురు అని భావము.

**ఎప్పటికెయ్యది ప్రస్తుత**
**మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్**
**నొప్పింపక తా నొవ్వక**
**తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు సుమతీ!**

**భావము:** ఏ సమయమునకు ఏది తగినదో, అప్పటికి ఆ మాటలను పలికి, ఇతరుల మనస్సులను బాధింపక, తను బాధపడక తప్పించుకొని నడచుకొనువాడే కృతార్థుడు.

**ఏఱకుమీ కసుగాయలు**
**దోఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ**
**పాఱకుమీ రణమందున**
**మీఱకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!**

**భావము:** ఈ భూమిమీద వచ్చి కాయలు ఏఱి తినకము. చుట్టమును దూషింపకము. యద్ధమునుంచి పారిపోకము, పెద్దల ఆజ్ఞను జవ దాటకము.

**ఓడల బండ్లును వచ్చును**
**ఓడలు నా బండ్లమీఁద నొప్పుగ వచ్చున్**
**ఓడలు బండ్లును వలెనే**
**వాడంబడుఁగలిమిలేమి వసుధను సుమతీ!**

**భావము:** ఓడల మీద బండ్లును, బండ్ల మీద "నావ"లు వచ్చునట్లుగనే భాగ్యవంతులకు దారిద్ర్యమును, దారిద్ర్యంతులకు భాగ్యమును బండి చక్రపుటాకుల వలె వచ్చును. అంటే కలిమిలేములు స్థిరము గాదని భావము.

**కనకపు సింహాసనమున**
**శునకము కూర్చుండఁబెట్టి శుభలగ్నమునఁ**
**దొనరగ బట్టము కట్టిన**
**వెనకటి గుణమేల మాను వినరా సుమతీ!**

**భావము:** ఓ మంచి బుద్ధి గలవాడా! మంచి ముహూర్తము చూసి క్కును తీసుకుని వెళ్లిబంగారపు సింహాసనమున కూర్చోబెట్టి పట్టాభిషేకము చేసినా కూడా అది దాని నైజాన్ని ఎలా అయితే మార్చుకోలేదో అలాగే అల్పుడైన వానిని ఎంతో గౌరవించి ఉన్నత పదవిలో కూర్చుండబెట్టినా అతని బుద్ధి మారదు. అంటే ఎంత ఉన్నత పదవి వరించినా కూడా అల్పుడు తన నీచత్వమును వదలనేరడు అని భావము. కుక్క బంగారు సింహాసనము మీద కూర్చున్నా కూడా దాని వెనుకటి నైజమును ఎలా మార్చుకోలేదో అలా అల్పుడు కూడా తన బుద్ధిని మార్చుకోలేడు అని భావము.

**కూరిమి గల దినములలో**
**నేరము లెన్నడు గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు అన్నీ నేరములుగాను, తప్పులుగాను కనిపిస్తాయి. ఇది నిజము... ఇది సహజము.

**కమలములు నీటఁబాసినఁ**
**గమలాప్తుని రశ్మి సోఁకి కమలిన భంగిన్**
**దమ దమ నెలవులు దప్పినఁ**
**దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!**

**భావము:** కమలముకు నివాసము నీరు. ఆ కమలములు తమ నివాసమైన నీటిని విడిచిపెట్టిన తరువాత మిత్రుడగు సూర్యుని వేడిచే కమలిపోవును. అట్లే మానవులు కూడా తమ తమ నివాసములను విడిచిపెట్టినచో, తమ స్నేహితులే విరోధులుగా మారి భాధించును. ఇది నిజమని గమనించాలి.

**కులకాంత తోడ నెప్పుడుఁ**
**గలహింపకు, వట్టి తప్పు ఘటియింపకుమీ**
**కలకంఠి కంట కన్నీరొలికిన**
**సిరి యింటనుండ నొల్లదు సుమతీ!**

**భావము:** భార్యతోడు ఎప్పుడూ జగడమాడ వలదు. లేని నేరములు ఆరోపించవలదు. ఉత్తమ ఇల్లాలి యొక్క కంట నీరు క్రిందపడిన ఆ ఇంటియందు లక్ష్మిదేవి నిలువదు.

**కొఱగాని కొడుకు పుట్టినఁ**
**కొఱగామియె కాదు తండ్రి గుణముల జెఱచున్**
**జెఱకు తుద వెన్నుఁపుట్టిన**
**జెఱకునఁ దీపెల్ల జెఱచు సిద్ధము సుమతీ!**

**<u>భావము:</u>** చెఱకుగెడ చివర వెన్నుపుట్టినచో యా చెఱకుగెడ యందలి తీపి అంతయును ఎట్లు చెరచునో అట్లే అప్రయోజకుడగు కుమారుడు పుట్టిన ఆ వంశమునకు ఉపకారి కాకపోయిననూ సరే గదా! తన తండ్రి మంచి గుణములను చెరచును. చెడ్డకీర్తి తెచ్చునన్న మాట.

**చీమలు పెట్టిన పుట్టలు**
**పాము కిరవైన యట్లు పామరుఁడు దగన్**
**హేమంబుఁ గూడఁబెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!**

**<u>భావము:</u>** ఓ సుమతీ! భూమిలో చీమలు కష్టపడి పెట్టిన పుట్టలో పాములు చేరును. అట్లే మూర్ఖుడు దాచి ఉంచిన బంగారం రాజులపాలై అతనికి ఉపయోగపడక పోవును.

**తలనుండు విషము ఫణికి**
**వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్**
**దల తోఁక యనక యుండును**
**ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!**

**<u>భావము:</u>** ఓ సుమతీ! సర్పమునకు అంటే పాముకు తల యందు మాత్రమే విషము ఉండును. తేలుకు తోకయందు విషము ఉండును. కానీ మనిషికి మాత్రము తల, తోక అని లేకుండా నిలువెల్ల అంటే శరీరమంతా విషము ఉండునని భావము.

**తన కోపమె తనకు శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టం**
**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! ఎవరికైననూ తన కోపమే తనకు శత్రువ అగును. తన శాంతమే తనకు రక్షగా నిలచును. తన చూపెడి దయా గుణమే బంధువులవలె సహకరించును. తాను సంతోషముగా ఉండ గలిగినచో అది స్వర్గముతో సమానము. తాను దుఃఖమును చేతులాన తెచ్చుకొనినచో అదియే నరకమగుట తథ్యము!!

**నీరే ప్రాణాధారము,**
**నోరే రసభరితమైన నుడువుల కెల్లన్**
**నారియె వరులకు రత్నము**
**చీరయే శృంగారమండ్రు, సిద్ధము సుమతీ!**

**భావము:** అన్ని ప్రాణులకు నీరే ఆధారమైనది. నవరస భరితములైన మాటలకు ఆధారము నోరు. వస్త్రమే మానవునకు అందము తెచ్చునది. నీరు – నోరు – మహిళ – వస్త్రము ప్రజలకు ముఖ్యమని భావము.

**పుత్రోత్సాహము తండ్రికి**
**పుత్రుడు జన్మించినప్పుడె పుట్టదు జనులా**
**పుత్రుని కనుగొని పొగడగ**
**పుత్రోత్సాహంబునాడు పొందుర సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! కొడుకు పుట్టగానే తండ్రికి సంతోషము కలుగదు. కానీ ఆ కొడుకు గొప్పవాడై ప్రజలు అతనిని పొగడుతున్నప్పుడు ఆ తండ్రికి నిజమైన సంతోషము కలుగును.

**బలవంతుఁడు నాకేమని**
**పలువురితో నిగ్రహించి పలుకుట మేలా**
**బలవంతమైన సర్పము**
**చలిచీమల చేతఁజిక్కి చావదె సుమతీ!**

**<u>భావము:</u>** నేను బలవంతుడను, విద్యావంతుడను అని గర్వంతో సంచరించరాదు. ఆవిధంగా నిర్లక్ష్యంగా ఉండి అందరితో విరోధము తెచ్చుకోవడం మంచిది కాదు. అది ఎప్పుడైనా హాని కలిగించును. మిక్కిలి బలము కలిగిన సర్పము కూడా చలి చీమలకు చిక్కి చచ్చుచుండుట లేదా? పాములను చంపుట చలి చీమలకు అసాధ్యము గదా! సాటి వారితో సమయానుకూల స్నేహము చేయాలని బోధ.

**బంగారు కుదువ చెట్టకు**
**సంగరమునఁ బాఱిపోకు సరసుఁడవగుచో**
**సంగడి వెచ్చము లాడకు**
**వెంగలితోఁజెలిమి వలదు వినరా సుమతీ!**

**<u>భావము:</u>** బంగారు వస్తువులను తాకట్టు పెట్టరాదు. యుద్ధము నందు వెన్ను చూపించి పారిపోవరాదు. అంగడియందు వస్తువులు అరువు తెచ్చుకోరాదు. మూర్ఖునితో స్నేహము చేయరాదే. అందుచే కష్టములు వచ్చునని భావము.

**మాటకుఁ బ్రాణము సత్యము**
**కోటకుఁ బ్రాణంబు సుభట కోటి, ధరిత్రిన్**
**బోటికిఁ బ్రాణంబు మానము**
**చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!**

**<u>భావము:</u>** నోటిమాటకు సత్యము ప్రాణము. పెద్ద దుర్గమునకు గొప్పదైన సేనా సమూహము ప్రాణము. స్త్రీలకు అభిమానము ప్రాణము. పత్రమునకు చేవ్రాలు ప్రాణములని గుర్తించి జీవనము చేయాలని ప్రబోధము.

**వినఁదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగున్**
**కనికల్ల నిజము దెలిసిన**
**మనుజుఁడెపో నీతివరుడు మహిలో సుమతీ!**

**భావము:** ఎవరు ఏమి చెప్పినా వినవచ్చును. అందులో ఎలాంటి తప్పులేదు. అయితే విన్న వెంటనే తొందరపడి నిర్ణయము తీసుకోకూడదు. బాగా ఆలోచించి, పరిశీలన చేసి ఆతర్వాత నిర్ణయము తీసుకోవాలి. అలా ఎవరైతే బాగా పరిశీలన చేసిన మీదట నిర్ణయము తీసుకుంటారో వారే ధర్మాత్ముడు అని భావము.

**వరిపంట లేని యూరును**
**దొరయుండని యూరు తోడు దొరకనితెరువున్**
**ధరను బతిలేని గృహమును**
**అరయంగా రుద్రభూమి యనఁదగు సుమతీ!**

**భావము:** వరి పంట లేని ఊరును, ప్రభువు లేని ఊరును. సహాయము దొరకని మార్గమును, భర్త లేని ఇల్లును, ఆలోచింపగా శ్మశానము వలె ఉండును. గాన పంటలు, ప్రభువు, మార్గము, భర్త ఉండాలని నీతి.

**సిరి తా వచ్చిన వచ్చును**
**సలలితముగ నారికేళ సలిలము భంగిన్**
**సిరి దాఁటోయిన బోవును**
**కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!**

**భావము:** సుమతీ! టెంకాయ లోపలికి నీరు వచ్చినట్లు సంపద తెలియకుండానే వస్తుంది. ఏనుగు మ్రింగిన వెలగపడులోని గుజ్జు మాయమగు విధంగానే మాయమగును.

**స్త్రీలయెడ వాదులాడక**
**బాలురతోఁ జెలిమి చేసి భాషంపకుమీ**
**మేలైన గుణము విడువకు**
**ఏలిన పతి నిందసేయ కెన్నడు సుమతీ!**

**భావము:** ఎన్నడునూ స్త్రీలతో వివాదములాడకూడకుము, బాలురతో స్నేహము చేసి మాట్లాడకుము, మంచి గుణములు వదలకుము, పాలించు యజమానుని దూషింపకుము.

నీవే తల్లివి తండ్రివి
నీవే నాతోడు నీడ నీవే సఖుడౌ
నీవే నాగురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!

**భావము:** ఓకృష్ణా! నాకు తల్లి, తండ్రి, తోడు, నీడ, స్నేహితుడు, గురువు, దైవము, ప్రభువు అన్నియును నీవే. నీవే నాకు దిక్కు.

దండమయా విశ్వంభర
దండమయా పుండరీక ధళ నేత్రహరీ!
దండమయా కరుణానిధి
దండమయా నీకు నెపుడు కృష్ణా!

**భావము:** ఓ కృష్ణా! సమస్త జగములను నీయందుంచుకొనిన వాడా ! తెల్లతామర రేకుల వంటి కన్నులు గలవాడా! శ్రీహరీ ! కరుణా సముద్రుడా ! నీకు ఎల్లవేళలయందును నమస్కరింతును.

నారాయణ లక్ష్మీపతి
నారాయణ వసుదేవ నందకుమారా!
నారాయణ నిను నమ్మితి
నారాయణ నన్ను బ్రోవు నగధర కృష్ణా !

**భావము:** ఓనారాయణా ! లక్ష్మీపతీ ! వాసుదేవా ! నందకుమారా ! నగధరా ! నిన్నే నమ్మితిని కనుక నన్ను నీవే రక్షింపుము.

**హరియను రెండక్షరములు**
**హరియించును పాతకంబు లంబు జనాభా**
**హరి నీ నామ మహత్త్యము**
**హరి హరి పొగడంగ వంశమే హరి శ్రీ కృష్ణా !**

**భావము:** ఓ కృష్ణా ! హరియనెడి రెండక్షరములు పాపములను హరించగలవు. ఓ శ్రీహరి నీ నామములోని మహత్త్యము కీర్తించుటకు అలవి గానిది.

**పాణితలంబున వెన్నయు**
**వేణిమూలంబునందు వెలయఁగ పింఛం**
**బాణిముత్యము ముక్కున**
**నాణేముగా దాల్చు లోకనాథుఁడ కృష్ణా !**

**భావము:** ఓ కృష్ణా! నీవు లోకములకెల్ల ప్రభుడవయ్యును. చేతిలో వెన్న ముద్దయు, సిగలో నెమలి పింఛమును, ముక్కున ఆణిముత్యమును ధరించి పసి బాలునివలె నుంటివిగదా!

**కంటికి రెప్పవిధంబున**
**బంటుగదాయనుచు నన్ను బాయక యెపుడున్**
**జంటయు నీవెండటనే**
**కంటకమగు పాపములను గడచితి కృష్ణా!**

**భావము:** కృష్ణా ! నేను నీకు బంటును గదా! నన్ను వెంటబెట్టుకొని పోవేమి? ఎల్లప్పుడు కంటికి రెప్పలాగున నన్నుఁ కాపాడవేమి?

**అంతా మిధ్య తలంచి చూచెన నరుడట్లౌ టెరింగిన్ సదా**
**కాంతల్పుత్రులు నర్థమున్ తనువు నిక్కంబంచు మోహార్ణవ**
**భ్రాంతిఁజెందిచరించుఁగాని పరమార్థంబైన నీయందుఁదా**
**జింతాకంతముఁజింత నిల్పడుఁగదా శ్రీకాళహస్తీశ్వరా!**

**<u>భావము:</u>** ఓ శ్రీకాళహస్తీశ్వర స్వామీ ! ఆలోచించి చూడగా ఈ జగమంతయు మిధ్య అని తెలిసియుభార్యాపుత్రులు, సంపదలు, ఈ శరీరమును శాశ్వతములని భ్రాంతిని జెంది మనవుడు ప్రవర్తించును. కానీ, సకల సంసార విషయముల కంటెను పరమార్థమైన నీయందు అతడు కొంచెమైననూ ధ్యానము నిలుపజాలకున్నాడు కదా!

**ఒకపూటించుక కూడు తక్కువగునే నోర్వంగఁలేడెండకో**
**పకనీడన్వెదకుం జలిం జడిసి కుంపట్లెత్తుకోఁజూచువా**
**నకు నిండ్లిండ్లను దూఱునీతనువు దీనన్వచ్చు సౌఖ్యంబురో**
**సి కడాసింపరు గాక మర్త్యులకటా శ్రీకాళహస్తీశ్వరా!**

**<u>భావము:</u>** శ్రీకాళహస్తీశ్వర స్వామీ! ఈ మానవులు ఒక్క పూటకొంచెము అన్నము తక్కువైననూ ఓర్చుకొనలేరు. కొంచెము ఎండకు ఓర్చుకొనలేక నీడకు బోజూతురు. చలికి దడిసి కుంపట్లవద్దచలి కాచుకొన జూతురు. వానకు తట్టుకొనలేక ఇండ్లలో దూరజూతురు ఈ శరీరము, దీనికి కలుగు సుఖము అనునవి స్థిరములు గావని తెలుసుకొనలేక చివరకి చేరవలసిన స్థితిని గురించి ఆలోచింపలేకున్నారు కదా!

**పాలున్ బువ్వయు పెట్టదన్ కడుపారా పావన్న, రాయన్ను లే**
**లే లెమ్మన్న, అరటి పండ్లుకొనితే, లేకున్న నే నొల్ల, నం**
**టే లాలింపరె తల్లితండ్రు లవుడట్లే తెచ్చి ? వాత్సల్య ల**
**క్ష్మీ లీలా వచనంబులన్ కడుపారా శ్రీకాళహస్తీశ్వరా!**

**<u>భావము:</u>** పాలు ఇస్తాను, అన్నం పెడతాను తిను నాయనా, రారా అని బతిమలాడితే, కాదు అరటి పళ్లు తీసుకొనిరా, లేకపోతే నేను తినను అని పిల్లలు మారాం చేస్తే తల్లిదండ్రులు అట్లాగే కొని తెచ్చి ప్రేమతో బుజ్జగిస్తూ తినిపిస్తారు. అలాగే భక్తులుమారాంచేసినా భగవంతుడు వారి కోరకలు ప్రేమతో తీరుస్తాడు.

**వాణీ వల్లభ దుర్లభంబగు భవద్వారంబులన్నిచ్చి, ని**
**ర్వాణశ్రీ చెరపట్ట చూచిన విచారద్రోహమో, నిత్య క**
**ల్యాణ క్రీడలబాసి, దుర్దశలపాలై, రాజలోకాధమ**
**శ్రేణి ద్వారము దూర జేసి దిపుడో శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** శ్రీకాళహస్తీశ్వరా! సరస్వతీదేవి భర్త యగు బ్రహ్మదేవునకు కూడా అసాధ్యంబైన నీ ప్రేమయనెడి వాకిట్లో నిల్చి. మోక్షమనే లక్ష్మీదేవిని పొందాలని కోరుకోవటం నాదుశ్చేష్టయనక తప్పదు. కాకాపోతే నిత్యమూ శుభకరములైన కర్మలనాచరించే నేను వాటికి దూరమై, నీచే కోపావేశుడనై దుర్దశ పాలై, అధమ శ్రేణికి చెందిన రాజుల యొక్క ఆదరణము పొందినట్లుగా యున్నది. కనుక నా దుర్వ్యాపార లక్షణ మనస్సును తొలగించి, న్యాయమైన మనస్సునిచ్చి కాపాడుము.

**ఆలున్‌బిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచు న్మహాబంధనం**
**బేలా నామెడ గట్టినాడవిన నిన్నే వేళ జింతుంతు, ని**
**ర్మూలంబైన మనంబులో నెగడుదుర్మోహాబ్ధిలో గ్రుంకి యీ**
**శిలామాలవు జింత నెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** శ్రీకాళహస్తీశ్వరా! భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు, ధనము అనే గొప్ప బంధము నా కంఠమునకెందుకు ముడిపెట్టినావో గానీ, తెలియడంలేదు. ఆ కుత్తకచే నిన్నెపుడు స్మరించ గలుగుతాను? మూలతత్వంబైన నీయందలి భక్తి తొలగుటచే మనస్సులో వృద్ధిబొందుచున్న చెడ్డ మోహమనెడి సముద్రంలో మునిగిన ఈ దుఃఖానెట్లు తొలగించెదవో కదా! గాన దుఃఖసముద్రము నుండి దాటించి నీ పూజలు చేయుటకు అవకాశము కల్పించుము.

**నిను సేవింపగ నాపదల్పొడమనీ, నిత్యోత్సవంబబ్బనీ**
**జనమాత్రుండననీ మహాత్ముడననీ సంసార మోహంబుపై**
**కొననీ జ్ఞానముగల్గనీ గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ**
**చ్చిన రాని యవి నాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** శ్రీకాళహస్తీశ్వరా!నీకు సేవలు చేయు సందర్భములో ఆపదలు రానిమ్ము. అయినా కూడా అన్ని వేళలయందు వేడుకలు జరపగలను. సామాన్యుని వలె సంసార సముద్రములో మోహాదులను అనుభవించు చున్ననూ దుఃఖముల పాలైననూ, స్తుతించిననూ, ఒకే దీక్షతో నీ శరణు పొందుటయే భాగ్యముగా తలంచి నిన్ను వేడగలను. ఇది నా దీక్షయని విన్నవించుచున్నాను.

**నిన్నే రూపముగా భజింతు మదిలో, నీ రూపుకామోలో స్త్రీ**
**చన్నో కుంచమో, మేక పెంటియొ యీ సందేహముల్మాన్పినా**
**కన్నారన్భవదీయమూర్తి సగుణాకారంబుగా జూపవే**
**చిన్నీ రేజ విహార మత్తమధుపా శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** శ్రీకాళహస్తీశ్వరా! నీవు సర్వాంతర్యామివి. నీ భక్తులు కోరిన రీతిన సేవించిన చోటనే ప్రత్యక్షమగుచూ వార్కి వరాలను ఇచ్చుచున్నావు. **(1)** శ్రీకృష్ణుని ఆనతి మేరకు అర్జునుడు కృష్ణుని మోకాలి చిప్పమీద శివుని పూజించగా అర్జునునకు ప్రత్యక్షమై పాశుపతాస్త్రము నిచ్చెను. **(2)** ఒక భక్తుడు స్త్రీలోలుడై శివరాత్రినాడు సంగమము జరుపుచున్న తటి స్తనము మీద శివరూపమును ధ్యానించగా శివుడు ప్రత్యక్షమైవారికి కైవల్యమిచ్చెను. **(3)** ఒక వర్తకుడు ధాన్యము కొలుచుచుండగా ధాన్య కుంచము మీద శివుని ధ్యానించగా అచట ప్రత్యక్షమై వానకి మోక్షమిచ్చెను.

**నీరూపంబు దలంపగా తుదమెదల్నే ఆన నీవైనచో**
**రారారమ్మనియంచు చెప్పవు. వృథారంబంబులింకేటికిన్**
**నీరున్మ్రుంపుము పాలముంపు మిక నిన్నే నమ్మినాడంజుమీ**
**శ్రీ రామార్చిత పాదపద్మ యుగళా ! శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** శ్రీరామునిచే పూజింపబడిన పాదపద్మముల జంటగల ఈశ్వరా! నీ రూపము తుద మొదలు నేను కనిపెట్టలేను. నీవా నన్ను రమ్మని ఆహ్వానించవు. నిన్నే నమ్మి యున్నాను. పాల ముంచిననూ, నీళ్ల ముంచిననూ భారము నీదే ఈశ్వరా ! వమ్ము శ్రీఘ్రముగా రక్షించమని వేడుకొనుచున్నాము.

**తరగల్ పిప్పలవ్రతముల్ మెఱగుటద్దంబుల్ మరుద్దీపముల్**
**కరికర్ణాంతము లెండమావులతతుల్ ఖద్యోతకీట ప్రభల్**
**సురవిధీలిఖితాక్షరంబుల నవుల్ జ్యోత్స్నా పయఃపిండిముల్**
**సిరులందేల మదాంధులౌదురో జనల్ శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** ప్రాణములు, నీటి కెరటములు, రావియాకులు, అద్దపు మెరుగులు, గాలిలోని దపాలు, గజముల కర్ణముల చివర చివుళ్లు, ఎండ మావులు, మిణుగురు పురుగులు కాంతులు అశాశ్వితములైనవి గదా! సంపద అన్నియు వెన్నెల లోని పాలను ప్రోవు చేసినట్లున్నవి. అవి స్థిరముగాదు. అయినా జనులు ప్రాణముల తోడను, సంపదలతోడను, మదాంధులగుచున్నారు. ఎంత ఆశ్చర్యము! శ్రీకాళహస్తీశ్వరా!

**నిన్ను నమ్మితిన రీతి నమ్ము నొరులన్, నీకన్ను కాకెన్న లే**
**రన్నల్దమ్ములు తల్లిదండ్రులు గురుండాపత్సహాయుండు నా**
**యన్నా! యెన్నడు నన్ను సంస్కృతి విషాదాంభోధి దాటించు**
**యచ్చిన్నానంద సుఖాబ్ధి దేల్చెదొకదే శ్రీకాళహస్తీశ్వరా!**

**భావము:** పరమేశ్వరా! నేను నిన్ను నమ్మిన విధముగా నెవ్వరినీ నమ్మలేదు. నమ్మను కూడా. నీకంటే నాకు తల్లీ – తండ్రి అన్న – తమ్ముడు, గురువు, మిత్రుడు, ఎవ్వరునూ లేరు. నన్ను సంసార సముద్రమును దాటించి, ఆనంద సముద్రమున తేల్చెదవని కోరుచున్నాను. నా కోర్కెమన్నించి రక్షింపుము.

సీ. దేహమున్నవఱకు మోహసాగరమందు
మునుఁగుచుందురు శుద్ధ మూఢజనులు,
సలలిలై శ్వర్యముల్ శాశ్వతంబనుకొని
ఫద్రృమలను మానజాలరెవరు,
సర్వకాలము మాయ సంసార బద్ధులై
గురుని కారుణ్యంబు గోరుకొనరు,
జ్ఞాన భక్తి విరక్తులైన పెద్దలఁజూచి
నిందఁజేయక తాము నిలువలేరు.
తే.మత్తులైనట్టి దుర్జాతి మనుజులెల్ల
నిన్నుఁగనలేరు మొదటికే నీరజాక్ష!

**భావము:** నరసింహా ! బొత్తిగ తెలివిలేనివారు దేహమున్నంత వరకు మోహముతో సముద్రమున మునుగుచుందురు. బాగుగనున్నసంపదలు స్థిరమనుకొని, కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములు వదుల లేరు. ఎల్లప్పుడు మాయతో కూడిన సంసారమునందుగట్టుబడిన వారైగురువు యొక్క దయను గొనరు, జ్ఞానులు, భక్తులు, కోరికలేని వారలు నైనపెద్ద లజూచి దూషింపక నిలువలేరు. నీరజాక్షా ! మదించిన వారలగు చెడ్డరకపు జనులందరు నిన్ను మొదటికే చూడలేరు (చూడజాలరనుట).

సీ.హరిదాసులను నిందలాడకుండినఁజాలుఁ
సకల గ్రంధమ్ములు చదివినట్లు:
భిక్షమియ్యంగఁదప్పకుండినఁజాలుఁ
జేముట్టి దానంబు చేసినట్లు :
మించి సజ్జనుల వంచింపకుండినఁజాలు :
నింపుగా బహుమాన మిచ్చినట్లు:
దేవాగ్రహారముల్ దీయకుండినఁజాలుఁ,
గనకంపు గుళ్లను గట్టినట్లు:
తే.గీ.ఒకరి వర్షాశనము ముంచకున్నఁజాలు,
పేరు కీర్తిగ సత్రముల్ పెట్టినట్లు–
భూషణ వికాస ! శ్రీ ధర్మపుర నివాస !
దుష్ట సంహార ! నరసింహ ! దురితదూర !

**భావము:** ఓ నరసింహస్వామీ ! హరి భక్తులను నిందించక పోయినను చాలును, సకల గ్రంథములను చదివినట్లే ! ఒకరికి భిక్షము పెట్టునపుడు వలదని నివారించకుడిన చాలును, తాము కూడా దానము చేసినట్లే ! సజ్జనులను మోసము చేయకుండిన చాలును, వారికి మంచి బహుమాన మిచ్చినట్లే !... దేవతలకు, బ్రహ్మణులకు ఇచ్చిన అగ్రహారములను, భూములను ఆక్రమించుకొనపోయిన అంతే చాలును బంగారపు గుడులు కట్టించినట్లే.

అడవి పక్షుల కెవ్వాడాహార మిచ్చెను!
మృగజాతి కెవ్వడు మేతఁబెట్ట
వనచరాదులకు భోజనమెవ్వడిప్పించెఁ?
జట్ల కెవ్వడు నీళ్లు చేదిపోసె?
ఫణుల కెవ్వడు పోసెఁబరగపాలు?
తే.గీ. జీవకోట్లను బోషింప నీవగాని,
వేఱెయొక దాత లేడయ్య వెదికి చూడ!
భూషణ వికాస ! శ్రీ ధర్మపుర నివాస!
దుష్ట సంహార ! నరసింహ ! దూరితదూర !

**భావము:**
ఓ నరసింహస్వామీ! అడవిలో నుండెడి పక్షులకు ఆహారమెవరిచ్చిరి? అడవి మృగములకు మేతబెట్టినవారెవరు? వనచరములకు ఆహారమును ఎవరిచ్చిరి? చెట్లకు నీటిని ఎవరు తోడిపోసినారు? స్త్రీల గర్భములోని శివువులనెవ్వరు పెంచుచున్నారు? నాగులకు పాలెవ్వరు పోయుచున్నారు? తుమ్మెదలకొరకెవ్వరు తేనెను పూవులలో నేర్పరచిరి? పశువుల కెవ్వరు గ్రాసమును పెంచిరి? ఎంతగా వెదకి చూచిననూ జీవకోటిని పోషించువాడవు నీవే గానీ వేరొాడు లేడు.

**చ. సిరిగల వాని కెయ్యడల చేసిన మేలది నిష్ఫలంబగున్**
**నెఱి గుఱిగాదు పేదలకు నేర్పున చేసిన సత్ఫలంబగున్**
**వఱపున వచ్చి మేఘుడొక వర్షము వాడిన చేల మీదటన్**
**కురిసిన గాక అంబుధుల కుర్వగ ఏమి నవలంబు భాస్కరా!**

**<u>భావము:</u>** ధనవంతునికి మనం చేసే మేలు వ్యర్థం. పేద వానికి చేస్తే ప్రయోజనం కలుగుతుంది. వానలు లేనప్పుడు ఎండిపోతూ ఉన్న చేల మీద మేఘుడు వాన కురిస్తే ఫలితం ఉంటుంది కానీ సముద్రం మీద కురిస్తే ప్రయోజనం ఏమిటి?

**ఉ. సన్నుత కార్యదక్షుడొకచాయ నిజప్రభ యప్రకాశమై**
**యున్నపుడైన లోకులకు నోండొక మేలొవరించు సత్వసం**
**న్నుడు భీముడా ద్విజుల ప్రాణము కావడే ఏకచక్రమం**
**దెన్నికగా బకాసురుని నేపున రూపడగించి భాస్కరా!**

**<u>భావము:</u>** భీముడు బ్రాహ్మణ వేషములో అజ్ఞాతముగాగడుప వలసి వచ్చిన సమయమున కూడా ఏక చక్రపురము నందలి బ్రాహ్మణ కుటుంబమును బకాసురుని బారినుండి రక్షించ గలిగినాడు. కనుక కార్యదక్షుడైనవాడు ఏ కారణము చేతనైననూ తన గొప్పతనమును మరుగు పరుచు కొనవలసి వచ్చిననూ ఇతరులకు తనకు చేతనైనంత మేలు ఏదైననూ చేయగలడని భావము.

**అడిగనయట్టి యాచకుల ఆశలెరుంగక లోభవర్తియై**
**కడపిన ధర్మదేవత ఒకానొకయప్పుడు నీదు వానికె**
**య్యెడల: అదెట్లు పాలు తమకిచ్చునె యచ్చనుటనైన లేగలన్**
**కడువగ నీనిచో కెరలి గోవులు తన్నును గాక : భాస్కరా!**

**<u>భావము:</u>** భాస్కరా! దూడలను తాగనియ్యకుండా మొత్తం పాలు తీసకోవాలని సిద్ధపడితే ఆవులు పాలియ్యవు సరే కదా తంతాయి. అలాగే ఏదో యిసాన్రి ఆశతో వచ్చి చేయి చాచి అడిగే వారికి లోభితనముతో పొమ్మంటే ధర్మదేవత ఆ లోభికి ధనం ఎప్పుడూ రాకుండా చేస్తుంది అడిగిన వారికి ఎంతో కొంత యిస్తూ ఉంటే ధనం ఏదో విధంగా వస్తూ ఉంటుంది. కాబట్టి యాచించే వారిని చులకనగా చూచి 'లేదుపో' అని అనకూడదు.

**ఒక్కడు మాంసమిచ్చె మఱియొక్కడు చర్మము గోసి యచ్చెవే**
**తొక్కరుడస్థినిచ్చె నిక నొక్కడు ప్రాణములిచ్చె వీరిలో**
**నొనొక్క వట్టునన్ బ్రదుక నోవక యిచ్చిరొ కీర్తి కిచ్చిరో**
**చక్కగ జూడ మంత్రి కుల సంభవ! రాయనమంత్రి భాస్కరా!!**

**<u>భావము:</u>** ఒకరు శరీరంలో నుండి మంసాన్ని కోసి ఇచ్చారు. ఒకరు చర్మం కోస ఇచ్చారు. మరొకరు వెన్నెముక ఇచ్చారు. ఇంకొకరు ప్రాణమే ఇచ్చారు. వీళ్లంటా బతుకలేక ఈ పనులు చేశారా? కీర్తికోసం చేశారా? ఒ మంత్రి కులంలో జన్మించిన రాయన భాస్కరుడా! బాగా ఆలోచించి చూడు.

**ఊరక సజ్జనుండొదిగి యుండినన్తైన దురాత్మకుండుని**
**ష్కారణ మోర్వలేక అపకారము చేయుట వాని విద్యగా**
**చీరలు నూరు టంకములు చేసెడివైనను పెట్టెనుండగా**
**చేరి చినింగి పోగొరుకు చిమ్మటకేమి ఫలంబు? భాస్కరా!**

**<u>భావము:</u>** ఎంతో విలువైన బట్టలు పెట్టెలో ఉండగా చిమ్మట పురుగు వాటికి చిల్లులు పెట్టి కొరికిపాడు చేస్తుంది. దానివల్ల ఆ పురుగుకి ఏమి లాభం? ఏమీ లేదు. వాటిని పాడు చెయ్యడం దాని స్వభావం. అలాగే ఎవ్వరినీ ఏమీ పల్లెత్తుమాట అనక తన యింట తాన్ను సజ్జనుణ్ణి నిష్కారణంగా దుర్జనుడు అపకారం చేసి బాధపెడతాడు. వాడికి వచ్చే లాభం ఏమిటి? ఏమీ లేదు. చెడ్డవాని గుణం అది. (అలాంటి పనులు చెయకయకూడదని నీతిపాఠం).

**శ్రీగల భాగ్యశాలిcగడుc జేరcగవత్తురు తారుదారె దూ**
**రాగమన ప్రయాసమున కాదట నోర్చియునైన నిల్వను**
**ద్యోగముచేసి, రత్ననిల యుండని కాదె సమస్త వాహినుల్**
**సాగరు జేరుటెల్ల ముని సన్నుత మద్గురుమూర్తి భాస్కరా!**

**<u>భావము:</u>** మునులచే స్తుతింపబడిన, సర్వజనులకు గురుమూర్తి యగు ఓ భాస్కరా! జనులు భాగ్యవంతుల వద్దకు, చాలా దూరము, శ్రమయని గుర్తించక ఓర్పుతో నివసించుటకు, నిధియగు సముద్రుని వద్దకు సాగరములన్నియును ప్రకృతి సిద్ధముగా చేరును గదా! అట్లే సంపదలున్నవాని వద్దకు జనులు ఆహ్వానము లేకునే చేరగలరని భావము.

**అతిగుణహీనలోభికిc బదార్థము గల్గిన లేకయుండినన్**
**మితముగcగాని కల్మిగల మీcదటనైన భుజింపడింపుగా**
**నతమని నమ్మ దేహమును సంపద, నేఱులునిండిపాఱినన్**
**గతుకగcజూచుc గుక్క దనకట్టడ మీఱక యెందు భాస్కరా!**

**<u>భావము:</u>** భాస్కరా! సద్గుణములు లేని లోభి వానికి సంపద కల్గిననూ, లేకపోయిననూ మితముగా భుజించును. సంపద కల్గిన మీదట కూడా లేని వాని వలె భుజించును.

ఎందుకనగా శరీరము, భాగ్యము శాశ్వతమని నమ్మిజీవనము గడుపును. ఎట్లనగా నదులు సంపూర్తి జలముతో ప్రవహించుచున్ననూ, కుక్కతన అలవాడు చొప్పున నాలుకతో నీటిని త్రాగును. పుష్టిగా త్రాగదు కదా!

**అనఘునికైనc జేకుఱు నవర్చుని గూడి చరించినంతలో**
**మన మెరియంగ నప్పుcడవమానము కీడు ధరిత్రియందు నే**
**యనువుననైనc దప్పవు యదార్థము తానది యెట్టులన్నచో**
**నినుమును గూర్చియగ్ని నలయింపదె సమ్మెట పెట్టు భాస్కరా!**

**<u>భావము:</u>** ఇనుముతో కలిసియున్న అగ్నికి సమ్మెట పోటు పడినట్లుగా, లోకమునుందు తగని వానితో స్నేహము చేయుచూ సంచరించు వానికి, ఎంతటి సద్గుణ వంతునకైననూ నేదియో నొక సమయాన అవమానము, హాని కలుగును. ఇయ్యది తప్పని సరిగా గుర్తుంచుకొనుము.

**ఈక్షితి నర్థకాంక్ష మదినెప్పుడు పాయక లోకులెల్ల సం**
**రక్షకుడైన సత్ప్రభుని రాకలగోరుదు రెంచుcజంద్రికా**
**పేక్షc జెలంగి చంద్రుcడుదయించు విధంబునకై చకోరపుం**
**బక్షులు చూడవే యెదుర పారముదంబును బూని భాస్కరా!**

**<u>భావము:</u>** భాస్కరా! భూమి యందు సంచరించెడు మానవులు సంపద యందు అత్యాశచే కాపాడునట్టి రాజునకై అన్వేషించిజీవనార్థము స్థిర నివాసమేర్పర్చు కొందురు. ఏలయనగా చకోర పక్షులు తన ఆనందము ననుభవిచుట కొరకు రాత్రియందు చంద్రుని యొక్క వెన్నెలకై అన్వేషించును కదా! అట్లే మానవులు కూడా పై విధముగా అన్వేషించెదరు.

**ఈజగమందుఁదామనుజుఁడెంత మహాత్మకుఁడైన దైవమా**
**తేజముతప్పఁజూచునెడఁ ద్రిమ్మరికోల్పడుఁ నెట్లన న్మహా**
**రాజకుమారుఁడైన రఘురాముఁడు గాల్నడగా యలాకులున్**
**భోజనమైతగన్వనికిఁబోయిఁ, చరింపఁడెమున్ను భాస్కరా!**

**<u>భావము:</u>** మానవుడు ఎంత గొప్పవాడైననూ గ్రహయోగ బలము వక్రించినచో నా గొప్పతనమంతయునూ తగ్గిపోయి, దేశ సంచారియై తప్పక తిరుగవలసిన స్థితి ఏర్పడవచ్చును. ఎట్లనగా శ్రీరామ చంద్రుడు కాలినడకతో నడవి కేగి ఆకులు, కాయలు, మున్నగునవి భుజించి, తిరిగి రాజ్యమునకు వచ్చెను గదా! అట్లే విధి వక్రించనచో ఎంత వాడైననూ విధిననుసరించి నడవ వలసిందేనని భావము.

**ఎట్టుగఁబాటువడ్డ నొకయించుక ప్రాప్తము లేక వస్తువుల్**
**పట్టుపడంగ నేరవు నిబద్ధి సురావళిఁగూడి రాక్షసుల్**
**గట్టు పెకల్చి పాల్కడలి గవ్వము చేసి మధించిరంతయున్**
**వెట్టియెకాక యేమనుభవించిరి వారమృతంబు భాస్కరా!**

**<u>భావము:</u>** అమృతము కొరకు రాక్షసులు, దేవతలు స్నేహముతో కలిసి మందర గిరిని ద్రెచ్చి కవ్వముగా చేసి, పాల సముద్రమును చిలికిరి. రాక్షసులు పడిన పాట్లు వ్యర్థము. వారికి అమృతము లభించలేగు. ఆవిధముగనే మానవుడెంత కష్టపడిననూ దానిని అనుభవింపదగిన అదృష్టము లేకపోతే ఫలితము లభించదని సారాంశము.

**ఏల సమస్త విద్యల నొకించుక భాగ్యము గల్గియుండినన్**
**జాలున నేక మార్గముల సన్నుతికెక్క, నదెట్లోకోయనన్**
**ఱాలకు నేడ విద్యలు తిరంబుగ దేవత రూపు చేసినన్**
**వ్రాలి సమస్కరించి ప్రసవంబులు పెట్టరె మీద భాస్కరా!**

**<u>భావము:</u>** రాళ్ళు విద్యలు నేర్వక యున్ననూవాటి అదృష్టముచే దేవతా ప్రతిమలగును. జనులు ఆ ప్రతిమలకు పూలతో అర్చనలు, సుపూజలు చేసి తరిస్తారు. ఆవిధంగానే అదృష్టరేఖ యుండినచో సమాజమునందు కీర్తి ప్రతిష్టలతో విరాజిల్లుతారు. అంటే విద్య లేకపోయిననూ అదృష్టరేఖ ముఖ్యమని భావము.

**దానము సేయగోరిన వదాన్యు కీయcగ శక్తిలేనిచో**
**నైనcబరోప కారమునకై యొకదిక్కునc దెచ్చియైన నీ**
**బూనును, మేఘుcడంబుధికి బోయి జలంబుల దెచ్చియీయడే**
**వాన సమస్త జీవులకు వాంఛిత మిపెనలార భాస్కరా!**

**<u>భావము:</u>** మేఘుడు తన వద్ద జలము లేనిచో సముద్రము వద్దకు వెళ్ళి జలమును ద్రెచ్చి సర్వప్రాణులకు వర్షముగా ధారపోయును. దానిచే ప్రాణులు తృప్తిని చెందును. అట్లే ధర్మాలవంబియైన దాత తన వద్ద దానము చేయుటకు శక్తి లేకున్ననూ, ఇంకొకచోటి నుండియైనను తెచ్చి దానమ చేసి పరోపకారము చేయుచుండెను.

**తెలియని కార్యమెల్లc గడతేర్చుటకొక్క వివేకి జేకొనన్**
**వలయునట్టైనదిద్దుకొనవచ్చు బ్రయోజనమాంద్యమేమియుం**
**గలుగదు ఫాలమందు దిలకంబిడునప్పుడు చేతనద్దమున్**
**గలిగిన జక్క జేసికొనుగాదె నరుండది చూచి భాస్కరా!**

**<u>భావము:</u>** మనుజుడు నుదుటి యందు బొట్టును పెట్టు కొనచూ, చేతియందు అద్దముతో బొట్టును వంకర టికర లేకుండా సరి చేసుకొనును. అట్లే నేర్పరి వద్దకెళ్లి పనులను చక్కదిద్దుకొని సంతోషా తిశయమును తెలివి గలవాడు పొందునని భావము.

**హీనకులంబులందు జనియించిన వారికి సద్గుణంబు లె**
**న్నేనియుc గల్గియున్న నొకనేరము చెందకపోదు పద్మముల్**
**భూనుతి గాంచియున్ బురద బుట్టుటవల్ల సుధాకరోదయం**
**బైన సహస్య మొందవెప్రియంబున జూడగలేక భాస్కరా!**

**<u>భావము:</u>** లొకంలో మిక్కిలి ఖ్యాతి గల తామర పువ్వులు బురద యందు బుట్టుటచే గల్గిన దోషము వలన చంద్రోదయ సమయానికి యేవగించి చూచుచుండును. కానీ ప్రియముతో జూడవు. అట్లే తక్కువ కులము నందు పుట్టిన మానవునకెన్ని సద్గుణములు ఉన్ననూ నొక్క చెడు గుణము మాత్రము ఉండగలదని భావము.

**స్థానము తప్పివచ్చునెడఁ తానెటువంటి బలాఢ్యుడున్ నిజ**
**స్థానకుడైన యల్పుని కతంబుననైనను మోసపోవుగా**
**కానలలోవలన్ వెడలి గంథగజం బొకనాఁడు నీటిలోఁ**
**గానక చొచ్చినన్ మొసలికాటున లోఁబడదోటు భాస్కరా!**

**<u>భావము:</u>** మదించిన ఏనుగు అడవిని వదలి నీటి యందు ప్రవేశము గల్గిన తోడనే మొసలికి లొంగిపోయినది గదా! అట్లే మానవుడు ఎంత బలము గలవడైననూ తన స్థానమును విడిచి, అన్య స్థానమును చేరినచో బలము తగ్గి పరాభవములు పొందునని భావము.

**పండితులైనవారు దిగువందగ మండగ నల్పుడొక్కడు**
**ద్దండతఁ బీఠమెక్కిన బుధప్రకరంబులకేమి యెగ్గగున్**
**కొండొక కోతిఁ జెట్టు కొనకొమ్మల నుండగ గ్రింద గండ భే**
**రుండ మదేభ సింహానకురంబములుండె చేరి భాస్కరా!**

**<u>భావము:</u>** కోతి ఒకటి చెట్టుమీద చిటారెకొమ్మన ఎత్తున కూర్చుని యున్నంత మాత్రమున ఆ చెట్టు క్రింద, నేల మీద సంచరించు గండ భేరుండములు, మదపు టేనుగులు, సింహముల గుంపులకు వచ్చిన తక్కువతనము లేదు కదా! అలాగే పండితులైన వారు క్రింద కూర్చుని యుండగా, అల్పుడైనవాడు ఉన్నతా స్థానముపై కూర్చోన్నంత మాత్రము చేత ఆ పండితుని కేమాత్రమును అల్పత్వము రాదు. అనగా, వారి గౌరవము తగ్గదని భావము.

**చ. పరహితమైన కార్యమతి భారము తోడిదియైన పూను స**
**త్పురుషుడు లోకము ల్పొగడ, పూర్వమునందొకరాల వర్షమున్**
**కురియగ చొచ్చినన్ కదిసి గొబ్బున గోజన రక్షణార్థమై**
**గిరి నొక కేల ఎత్తెనట కృష్ణుడు ఛత్రము భాతి భాస్కరా!**

**<u>భావము:</u>** లోకులకు హితాన్ని కలిగించే పని ఎంత కష్టమైనది అయినా మంచివాడు పూనుకుంటాడు. పూర్వం రాళ్ల వర్షం కురిసిన సమయంలో గోవులను, గోపాంకులనూ రక్షించడానికి కృష్ణుడు కొండనే ఎత్తి గొడుగుగా పట్టాడు.

**పట్టుచుఁదండ్రి యత్యధమవర్తముఁడైనను గాని వానికిం**
**బుట్టిన పుత్రకుండు తన పుణ్యవంశబున దొడ్డ ధన్యుఁడా**
**నెట్లన మఱ్ఱివిత్తు మునుపెంతయు గొంచెము దాన బుట్టనా**
**చెట్టు మహోన్నతత్వమునకు జెంద దెశాఖల నుండి భాస్కరా!**

**భావము:** మర్రి చెట్టు విత్తనము చిన్నది అయినను దాని నుంచి వచ్చిన మొక్క పెద్ద చెట్టై శాఖోపశాకలుగా మహావృక్షము అగును. అట్లే తండ్రి నీచ ప్రవర్తన కలవాడైననూ తన పూర్వ పుణ్యాన గొప్పవాడుగా కావచ్చునని భావము.

**తనుజులనుం గురువృద్ధుల**
**జననీజనకులను సాధుజనుల నెవడు దా**
**ఘనుడయ్యు బ్రోవడాయా**
**జనుడే జీవన్మృతుండు జగతి కుమారా!**

**<u>భావము:</u>** ఓ కుమారా! తన కుమారులను, గురువులను, పెద్ద వారిని, తల్లిదండ్రులను, సజ్జనులైన వారిని, ఎవడు తన చేతనైనను తగిన సమయముఎన రక్షింపడో అతడు బ్రతికి ఉన్నను చచ్చినవాడితో సమానమే.

**వగవకు గడిచిన దానికి**
**బొగడకు దుర్మతులనెపుడు పొసగని పనికై**
**యేగి దీనత నొందకుమీ**
**తగదైవగతిం బొసంగు ధరను కుమారా!**

**<u>భావము:</u>** ఓకుమారా! అయిపోయిన దానిగురించి చింతించవద్దు. దుష్టులను మెచ్చుకొనవద్దు. నీకు సాధ్యము కాని దానిని పొందలేక పోతినని చింతించుట పనికిరాదు. భగవంతుడు యిచ్చిన దానితో తృప్తి చెందుము.

**వృద్ధజన సేవ చేసిన,**
**బుద్ధి వివేకజ్ఞుఁడనుచుఁ బూతచరితుఁడున్**
**సద్ధర్మశాలి యని బుధు**
**లిద్ధరఁ బొగడెదరు ప్రేమ యెసఁగన్ కుమారా!**

**<u>భావము:</u>** పెద్దలను భక్తితోఁ గొలుచుచున్న ఎడల వానిని లోకము నందు, పరిశుద్ధముగ మనస్సు కలవాడనియు, తెలివితేటలలు బాగుగ నుండు వాఁడనియు ధర్మముల నెఱింగిన వాఁడనియు పెద్దలగు వారందురు.

**పెద్దలు వ్లదని చెప్పిన**
**పద్దులఁబోవంగరాదు పరకాంతల నే**
**ప్రొద్దే నెదఁబరికించుట**
**కుద్దేశింపంగఁగూడ దుర్విన్ కుమారా!**

**భావము:** కుమారా! పద్దలు వద్దని చెప్పిన పనులు చేయబూనకుము. ఇతర స్త్రీలను ఎపుడయినను చూచుటకుఁ గోరవలదు. ఇవి పనికరాని పనులు.

**పోషకుల మతముఁగనుఁగొని**
**భూషింపక కాని ముదముఁబొందరు మఱియున్**
**దోషముల నెంచుమందురు,**
**దోషివయిన మిగులఁగీడు దోఁచుఁకుమారా!**

**భావము:** నిన్ను పోషించువారి మనస్సును గుర్తెరిగి వారిని గొప్ప చేయుచుండుము. అప్పుడే వారు సంతోషింతురు. లేకున్న దోషములను లెక్కింతురు. నీయందుఁ దప్పు గల్గిన యెడల నీకు హాని కలుగగలదు.

**చేయకుము కాని కార్యము,**
**పాయకుము మఱిన్ శుభం, బవని భోజనమున్**
**జేయకుము రిపు గృహంబునఁ**
**గూయకు మెదుమనసు నొచ్చుఁ గూఁతకుమారా!**

**భావము:** కుమారా! నీకు సాధ్యము కాని పనిని చేయుటకు ప్రయత్నింపవద్దు. మంచి దానిని వదలవద్దు పగవాని యింటి భుజింప వద్దు. ఇతరులకు నొప్పి కలుగునట్లు మాటలాడవద్దు.

**పిన్నల పెద్దలయెడcగడు**
**మన్ననచే మెలcగు సుజన మార్గంబుల**
**వెన్నికొని తిరుగుచుండిన**
**నన్నియెడల నెనcబడుదువన్న కుమారా!**

**<u>భావము:</u>** కుమారా! నీవు చిన్నవారిని, పెద్దవారిని చూచిన యెడల మర్యాదతోc బ్రవర్తింపుము. మంచివారు నడుచు మార్గములందు నడువుము. అట్లు నీవు ప్రవర్తించుచుండిన యెడల లోకము నందు అంతటను ప్రఖ్యాతి చెందగలవు. అందరు నిన్నుc బొగడుదురు.

**పెద్దలు విచ్చేసినచో**
**బద్ధకముననైన దుష్ట పద్ధతి నైనన్,**
**హద్దెఱింగి లేవకున్నన్**
**మొద్దువలెం జూత రతని ముద్దు కుమారా!**

**<u>భావము:</u>** పెద్దలు నీ దగ్గరకు వచ్చినప్పుడు పోమరితనము చేతcగాని, దుర్మార్గ వృత్తితోcగానీ నీవు మర్యాదతో లేవకున్న యెడల నిన్ను వారు మొద్దురీతిగా జూతురేగానీనీవొకప్రాఙముగల మనుష్యుడవని తలంపరు.

**తనపై దయ నూల్కొనcగను**
**గొన నేతెంచినను శీల గురుమతులను వం**
**దనముగc బూజింపం దగు:**
**మన మలరంగ నిదియ విబుధమతముకుమారా!**

**<u>భావము:</u>** ఎప్పుడైనను నీవు రహస్మము ఉండినప్పటికిని, లేకపోయినస్పటికి బయట చెప్పుటకైపోవద్దు. అనంc గా రహస్యము తెలిసిన దైనను నీవు మాత్రము వెలిబుచ్చవలదు. నిన్నుగన్న తల్లిదండ్రుల పేరు ప్రతిష్టలను మెచ్చుకొనునట్లుగా నడచుకొనుము.

**పుడమిని దుష్టత గలయా**
**తఁడు లంచంబులను బట్టఁదలఁచునుమిడియౌ**
**నడవడి మిడి యందఱి వెం**
**బడి ద్రిప్పికొనుచును గీడు పఱుపకుఁబుత్రా!**

**భావము:** చెడ్డ నడవడిగలవాఁడు దుడుకుతనముచే లంచాలను తీసికొనుటకుద్దేశించును. కాబట్టి దుష్టబుద్ధి గలవాఁడవై, లోకులనందఱను మర్యాద నతిక్రమించి వెంట ద్రిప్పుకొనుచు హాని చేయవద్దు.

**పనులెన్ని కలిగియున్నను**
**దిన దినముల విద్య పెంపు ధీయుక్తుఁడవై**
**వినఁగోరుము సత్కథలను**
**కని విబుధులు సంతసించు గతినిఁ గుమారా!**

**భావము:** నీకుఁ బ్రతిదినము పనులెన్ని యుండినప్పటికిని, విద్యయందలి గౌరవముతో, పెద్దలందఱును మెచ్చుకొనునట్లుగా మంచి మంచి కథలను పరిశీలించి వినుచుండుము.

**నరవరుఁడు నమ్మి తను నౌ**
**కరిలో నుంచునెడ వాని కార్యములందున్**
**సరిగా మెలంగ నేర్చిన**
**పురుషుఁడు లోకమునఁగీర్తి బొందు కుమారా!**

**భావము:** రాజు ఎవరిని నమ్మి తనకు సేవకునిగా నియమించు కొనునో అట్టివాడు అతని పులను శ్రద్ధతో చేయుచుండిన కీర్తిని పొందును.

**గ. ధరణినాయకు రాణియు**
**గురురాణియు నన్న రాణి కులకాంతనుగ**
**న్నరమణిదను గన్నదియును**
**ధర నేవురు తల్లులనుచుఁదలపుఁకుమారా!**

**భావము:** రాజు భార్యయను, గురు భార్యయను, అన్న భార్యయను, అత్తయును, ఈ ఐదుగురిని తల్లులుగా భావింపవలెను.

**క. అతి బాల్యములోనైనను,**
**ప్రతికూలపు మార్గములఁప్రవర్తింపక స**
**ద్గతిమీఱ మెలఁగ నేర్చిన**
**నతనికి లోకమున సౌఖ్యమగును కుమారా!**

**భావము:** ఎవడు లోకమునందు చిన్న వాడుగనుండినప్పటికిని విరుద్ధముగ నడువక మంచి మార్గమున నడుచుచుండునో వాడు లోకమున సుఖముగా జీవించగలడు. ఏ శ్రమలను పొందడు.

**శ్రీరఘురామ! చారుతుల - సీతదళదామ శమక్షమాది శృం**
**గార గుణాభిరామ! త్రిజ - గన్నుత శౌర్య రమాలలామ దు**
**ర్వార కబంధ రాక్షస వి - రామ! జగజ్జన కల్మషార్ణవో**
**త్తారకనామ! భద్రగిరి - దాశరథీ కరుణాపయోనిధీ!**

**భావము:** శ్రీ ఇక్ష్వాకు వంశమునగల రఘుమహారాజు పరంపరన జన్మించి, సొగసైన తులసీ దళములచే కూర్చబడిన దండను ధరించి, శాంతి, క్షమలనెడి ఇంపైన గుణములచే ప్రకాశించుచూ, ముల్లోకములందు పొగడదగిన పరాక్రమ లక్ష్మియే ఆభరణముగా గల్గి, వారింపనలవిగాని కబంధుడను రాక్షసుని వధించి, ప్రపంచమందలి గల మనుజుల యొక్క పాపములనెడి సముద్రములను దాటింపగలడని పేరు గల, దయకు సముద్రము వంటి రూపము దాల్చిన, భద్రాచలమనెడి కొండపైభాగమున నివాసముంటున్న, దశరథ మహారాజు కుమారుడైన రామా! నమస్కారము.

**హలికునకున్ హలాగ్రమున వర్ణము సేకురు భంగి దప్పిచే**
**నలనుటఁ జెందువానికి సురానగలో జల మబ్బినట్లు దు**
**ర్మలిన మనోవికారియగు మర్త్యుని నన్నొకఁడగూర్చి నీవయిన్**
**దలఁపు ఘటింపఁజేసితివి దాశరథీ కరుణాపయోనిధీ!**

**భావము:** రైతునకు నాగేటి చివర భోగమున హఠాత్తుగా ధనము లభించినట్లుగా, మఱియు దప్పికతో బాధపడువానికి గంగానదీ జల మబ్బినయట్లును, మఱియు చెడు బుద్ధిగల నన్ను చక్కఁజేసి, నా బుద్ధిని నీపై తలపు కలిగించునట్లు చేసినచో ధన్యుడనయ్యెదను దయాంతరంగుండవగు భద్రాద్రి రామా! నీకు నమస్కారము.

**కొండకతర్క వాదమును - గుద్దలిచేఁ బరతత్త్వభూస్థలిన్**
**రంజిలఁద్రవ్వి కనొగనని రామనిదానము నేఁడుభక్తిరా సి**
**ద్ధాంజన మందు హస్తగత మయ్యె భళీః యనంగ మదీయహృ**
**త్కంటక దైత్యనిర్ధళన దాశరథీ కరుణాపయోనిధీ!**

**భావము:** సంకోచింపక తర్కవాదములను చేయుచూ, భూమిని గుద్దలితో తవ్వినను కన్పించని నిధియనెడి రాముని, ఎప్పుడు భక్తియనెడి సిద్ధాంజనమగు కాటుకయందు నీ దర్శనము లభించుచున్నట్లుగా, ఇకమీద భక్తిచే నా హృదయ కమలమునందు నివసింపుము కరుణా సముద్రుడవగు భద్రాద్రి రామా! నీకు నమస్కారము.

**మామశ పాతక వఙ్రము మ్రాన్పగణ్యము చిత్రిగుప్తులే**
**మేమని వ్రాఁతురో శమనుఁడేమి విధించునో కాలకింకర**
**స్తోమ మొనర్చుటేమొ వినఁ జోప్పడదింతకమున్నె తీనచిం**
**తామణి యెట్లుగా చెదవొ దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** రామా! నా పాపములు పోవుటకు మార్గాలు చాలా కలవు. చిత్రగుప్తుడేమి వ్రాయునో? యముడేమి విధించునో, కాలకింకరు లేమి చేయునో, దీక్షతో కూడిన నీవు దీనులను ఆపత్సముద్రములందు పడిన వారినేల రక్షించెదవో తెలియుట లేదు. భద్రాద్రి రామా! నా కష్టములు తొలగించుటే నా విన్నపము.

**సూరిజనుల్ దయాపరులు సూనృతవాదు లలుబ్ధమానవుల్**
**వేరపతివ్రతాంగనలు విప్రులు గోవులు వేదముల్ మహా**
**భారముఁదాల్చఁగా జనులు పావనమైన పరోపకార స**
**త్కార మెఱుంగలే రకట దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** రామా! పండితులు, దయగలవారు, సత్యాచారపరులు, ఉదార స్వభావులు, పతివ్రతలు, బ్రాహ్మణులు, గోవులు, వేదములు మున్నగు విశిష్ట జన్ములు భూభారము వమించచుచుండ, జనులు పరోపకారము భూభార గైరవము లెఱుంగక సంచరించుచున్నారు రామా! ఏమని చెప్పను నాయందు దయ యుంచి నన్ను రక్షింపుము.

**చిరతర భక్తినొకకతులసీదళ మర్పణ చేయుఁవాడా ఖే**
**చరగరుడోరగ ప్రముఖ సంఘములో వెలుఁగన్ సదాభవత్**
**సురుచిర ధీంత పాదముల బూజలొనర్చిన వారికెల్లఁద**
**త్పర మరచేతిధాత్రిగద దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** రామా! సదా మీకు భక్తితో నొక్క తులసీదళమును సమర్పించిన వడు గరుడోరగ సమూహముతో ప్రకాశించును కదా! అటులనే మీ పాదారవిందములను పూజించడానికి అరచేతియందు ఉసిరికాయవలె మోక్షము లభించునట గదా! అటులనే నీ పాదారవిందములను పూజించుచున్న మీకు మోక్షపదమివ్వ కోరుచున్నాము. వెంటనే దయచేయుడు రామా! నమస్కారము.

**పాపములొందువేళ రణపన్నగ భూత భయజ్వరాదులన్**
**దావద నొందువేళ భ(ర)తా(గ)జ మిమ్ము భజించువారికిన్**
**(బ్రా)వుగ నీవుcదమ్ముcడిరు పక్కియలన్ జనితద్వి త్తి సం**
**తాపము మాన్ని కాతురట దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** రామా! పాపములు పొందునపుడును, యుద్ధము, సర్ప భయము, భూత బాధలు, శరీరము నందు రోగాదులు మున్నగు ఆపదలు కల్గిన వెంటనే, నిన్ను కొలుచు వారికి సహాయము చేయుటకై నీకు, తమ్ముళ్లైన లక్ష్మణ, భరతులను ఇరు ప్రక్కల పెట్టుకొని సన్నిధికొచ్చి రక్షించెదవని లొకులు పుకుచున్నారు. కాబట్టి ఆపదలలోయున్న నన్ను రక్షింపుము భద్రాద్రి రామా! నమస్కారము.

**తరువులు పూచికాయలగు దక్కు సుమంబులు పూజగాభవ**
**చ్ఛరణము పోcకిదాసులకు సారములో ధనధాన్యరాశులై**
**కరిభట ఘోటకాంబర నకాయములై విరజాన నము**
**త్తరణ మొనర్చుcజిత్రమిది దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** చెట్లుపూచి కాయలగును. ఆ పువ్వులను నీ పాదారవిందముల వద్దకు తెచ్చినచో ధనధాన్యములు కలుగును. మరియు చదురంగ బలములేర్పడి విరజానదిని కూడా దాటింపజేయును గదా! అట్లే సంసార రూపమగు విరజానదిని నన్నుకూడా దాటింపుము రామా!

**పట్టితి పట్టరార్యగురు పాదములమ్మెయి నూర్ధ్వపుం(డ)ముల్**
**ఎట్టితి మం(త్ర)రాజా మొడిcబెట్టితి వయ్యమకింకరాలికిం**
**గట్టితి బొమ్మమీచరణ కంజములందు దలంపు పెట్టిబో**
**దట్టితిcభావ పుంజముల దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** భట్టరార్యలను గురువుల పాదములను బట్టి, నీ చిహ్నామగు నామమును నొసట ధరించితిని. రామనామ మంత్రమును సాధించితిని. యమభటులనై బొమ్మంటిని. నీ పాదములపై తలపు పెట్టి పాపములను పోగొట్టుకొంటిని. ఇంతకంటే నేనేమియునూ చేయలేదు. రామా! రక్షింపుము.

**పండిత రక్షకుం డఖిల పాపవిమోచనుడబ్జసంభవా**
**ఖండలపూజితుండు దశ కంఠవిలుంఠన చండకాండకో**
**దండకళా ప్రవీణుcడను తావక కీర్తి వధూటికిత్తుంటూ**
**దండలు గాంగ నా కవిత దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** కరుణా సముద్రుడవగు ఓ రామా! నీవు పండిత రక్షణము చేయుచూ, సర్వపాపములను ఉపశమింపుచూ, బ్రహ్మాదులచే పూజింపబడుచూ, దశకంఠుని యొక్క తలలను దునుమునట్టి, వాడియైన బాణములను వేయగల ధనుర్విద్యాపారంగుడవై విరాజిల్లుచున్నావు. అందుచే పడతికి పూదండలంకరిచునట్లుగా నీ కీర్తికి నా కవిత్వమును అలంకరింపుచున్నాను. గ్రహించి నన్ను అనుగ్రహింపుము.

**అంచితమూననీదు కరుణామృత సారము నాధుపైని బ్రో**
**క్షించిన జాలదాన నిరసించెదనాదురితంబు లెల్ల పా**
**లించెద వైరివర్గ మెడ లించెదc గోర్కెలనీదు బంటనై ద**
**లంచెద గాలకికంరుల దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** రామా! ఒప్పిదమైన నీ దయామృతసారమును నామీద చల్లిన చాలును. దాని ప్రభావముచే నా పాపములను దూలించి, అంతశ్శత్రువులు అయిన ఇంద్రియములను చిక్కపట్టి, రాగ ద్వేషములను వదలి, నీదాసుడనై యమకింకరులు వచ్చినేని కొట్టి తరిమెదను దయా సముద్రుడవగు నో రామా! నీకు నా నమస్కారము.

**అల్లన లింగమంత్రి సుతుcడత్రిజ గోత్రజుcడాది శాఖ కం**
**చెర్లకులోద్భవుండనcబ్రసిద్ధుcడనై భవదంకితంబుగా**
**నెల్లకవుల్ మతింప రచియించితి గోపకవీంద్రుడనన్ జగ**
**త్వల్లభ నీకు దాసుండన దాశరథీ కరుణాపయోనిధీ!**

**<u>భావము:</u>** లింగన మంత్రి పుత్రుడను. ఆత్రేయస గోత్రజుడను. ఋక్శాఖవాడను. కంచర్ల వంశీయుడను. నీ భక్తుడనైన గోపకవీంద్రుడను వాడను కవులందరు పొగడగ నా శతకమును నీకు అర్పణము చేయుచుంటిని. గైకొని రక్షింపుము. రామా! నమస్కారము.

**జలనిధులేడు నొక్క మొగిc జక్కికిcదెచ్చెశరంబు ఱాతినిం**
**పలరంగ జేఎనా దాబ్జపరాగము, నీ చరిత్రమున్**
**జలజభనాది నిర్జనులు నన్నుతి సేయcగ లేరు గావునన్**
**దలcప నగణ్యమయ్య! యది? దాశరథీ కరుణాపయోనిధీ!**

**భావము:** రామా! నీ బాణము సప్త సముద్రముల నొక్కటిగా చేయును. నీ పాద పద్మముల తేజస్సు ఱాతిని స్త్రీగా చేసెను. ఇలాంటి నీ చరితము బ్రహ్మేంద్రుకైననూ పొగడ శక్యము గాదు. దానిని లెక్కింప అసాధ్యము. కరుణాభిరామా! నమస్కారము.

**అవనిజకన్ను దోయి తొగలందు వెలింగెడు సోమ, జానకీ**
**కువలయనేత్రి గబ్బిచను కొంలనుండు ఘనంబు మైథిలీ**
**నవనవ యౌవనంబను వనంబునకున్ మదదంతివీవెకా**
**దవిలి భజింతు నెల్లపడు దాశరథీ కరుణాపయోనిధీ!**

**భావము:** నీ ధర్మపత్నియగు సీతాదేవి యొక్క కన్నుల జంటయనెడి కలువులందు ప్రకాశించెడి చంద్రుడవు. మఱియు కల్వల వంటి కన్నులు గల జానకీదేవి యొక్క ఉబ్బిన స్తనములనెడి కొండల యందున్నట్టి మేఘుడవు మరియు సీతాదేవి యొక్క యౌవనమనెడి వనంబునకు మదించిన ఏనుగులాంటి వాడవు. ఇన్ని లక్షనములతో ప్రకాశించుచున్న నిన్ను ఇష్టముతో గొల్చుచున్నాను. భద్రాద్రి రామా! ఆదరించుము.

**పరపురుషులన్నదమ్ములు**
**వరుడే దైవమ్ము తోడి పడుచులు వదినల్**
**మరదంద్రు నత్తమామలు**
**దరcదల్లియు తండ్రియనుచు తలవు కుమారీ!**

**<u>భావము:</u>** అమ్మాయి! మగడు తప్ప పై మగ వారందరూనీ అన్నదమ్ములుగా ఎంచుకో! నీభర్త నీకు దేవుడనుకో! భర్త అక్కలూ, చెల్లెళ్లూ నీ అక్క చెల్లెళ్లుగా తల్చుకో. నీ అత్తమామలను నీ తల్లిదండ్రులుగా భావించి సమయానికి తగినట్లు వారికి సంరక్షణ చేస్తూ ఉండు అని భావము.

**నోరెత్తి మాటలాడకు**
**మారాడకు కోపపడిన, మర్యాదలలో**
**గోరంత తప్పి తిరుగకు**
**మీరకమీ అత్త పనుల మెలగు కుమారీ!**

**<u>భావము:</u>** బిగ్గరగా మాటలాడకు. అత్తగానీ, మామ గానీ దేనికైనా కోపించి ఏమైనా అంటే నువ్వు ఎదిరించి మాట్లాడకు. మన్ననగా మసలుతూండాలి. ఏ మాత్రం మర్యాదకి దెబ్బ తగిలేట్లు నడిచనానీకూ నీ పుట్టింటి వారికీ అపకీర్తి తెచ్చిన దానవవుతావు. అత్త చెప్పిన పని వెంట వెంటనే చేస్తే ఆమెకు సంతోషం కలిగిస్తూ ఉండు.

**పెనిమిటి వలదని చెప్పిన**
**పనియెన్నడు చేయరాదు బావలకెదుటన్**
**కనబడగరాదు, కోపము**
**మనసున నిడుకొనక యెపుడు మసలు కుమారీ!**

**<u>భావము:</u>** కుమారీ! భర్త వద్దన్న పని ఎప్పుడూ చెయ్యకూడదు. బావల ముందు నిల్చుని గానీ మాటాడడం లాంటి పనులు చెయ్యవద్దు. ఎవరేమన్నా మనసులో కోపానికి చోటివ్వకూడదు. కోపం పాపపు పనులు చేయిస్తుంది. శాంతంగా మసలుతూ ఉండాలి.

**మగనికి అత్తకు మామకు తగసేవ ఒనర్చుచోట**
**తత్పరిచర్యన్ మిగులనుతి పొందుచుండుట**
**మగువలకున్ పాడి తెలిసి మనలు కుమారీ!**

**<u>భావము:</u>** కుమారీ! అత్తవారింట మగనికి, అత్తమామలకు తగిన సేవ చేస్తూ వారివల్ల మెప్పు పొందేలా మసలుకోవాలి. ఇది స్త్రీల ధర్మం.

**జపములు గంగాయాత్రలు**
**తపములు నోములు దాన, ధర్మంబులు పు**
**ణ్య పురాణములు పతిభక్తికి**
**నుపమింపను సాటిరాక, యుండు కుమారీ!**

**<u>భావము:</u>** పతిభక్తికెట్టి జప తప పురాణ స్నాన ధర్మములను సరికి రావు. అంటే పతి భక్తి ముందు ఎలాంటి జపాతపాలు సాటిరావు అని అర్థం.

**ఇరుగు పొరుగిండ్లకైనను**
**వరుఁడో కాక అత్తగారో, వదినయొ మామో**
**మఱఁదియొ సెలవీకుండగఁ**
**తరుణి స్వతంత్రించి పోన దగదు కుమారీ!**

**<u>భావము:</u>** నీ యత్తవారి తాలూకెవ్వరిని అడుగకుండ నీవు స్వతంత్రించి పొరుగు ఇంటికైనను పోరాదు.

**అమ్మకు రెం డబ్బకు రెం**
**డిమ్మహిఁ దిట్టించు కూతు రెందుకు, ధర నా**
**ద్రిమ్మరి పుట్టకపోయిన**
**నిమ్మళమని యంద్రు జనులు, నిజము కుమారీ!**

**<u>భావము:</u>** కుమార్తె చెడ్డపేరు దుర్వాడుక తెచ్చుకంటే నట్టిది పుట్టకపోయినను మేలేయని జనులనుకొందురు. గాన తలిదండ్రులకు కీర్తి తెచ్చి తాను మంచిపేరు తెచ్చికొనవలెను.

**సుమతియును చంద్రమతియును**
**దమయంతియు జానకియును, ద్రౌపదియును బ**
**న్నములం బడి పతిభక్తిం**
**గ్రమమున నడపుటలుతలcపc గాదె కుమారీ!**

**<u>భావము:</u>** సుమతీదేవి, దమయంతి, ద్రౌపది, సావిత్రిమొదలగు పతివ్రత లెంతెంత కష్టాలకోర్చి పతిభక్తినెట్లు గడిపిరో యెంచుకొని నీవట్లు చేయుc ప్రయత్నింపుము.

**వేకువజామున మేల్కొని**
**పైకి వెడలి వచ్చి ప్రాcచిః పని దీర్పవెన్**
**లేకున్నcదెల్లవారిన**
**లోకులు న్వుదురు సభలః కుమారీ!**

**<u>భావము:</u>** తెల్లవారు జామున లేచిc పాచిపనులన్నియు జేపికొనక ప్రొద్దెక్కి లేచితివేని చూచినవారు, వినిన వారు నవ్వుటయే గాక వింతగా సభలలో గూడ ప్రజలు చెప్పుకుందురు.

**కడుబుద్ధి గల్గి మెలcగినc**
**బడతుక, పుట్టింటివారు, పదివేల వరా**
**లిడుటకంటె గీర్తియగు ద**
**మ్మిడి లేకుండినను నేర్చిః మెలఃగు కుమారీ!**

**<u>భావము:</u>** పుట్టింటి నుండి చాల ధనము తెచ్చినను చెడు నడవడికతో నడచినచో యెవ్వరును మెచ్చరు. నీవు కానీ లేకున్నను మంచి గుణము గల్గి నడచినచో యెన్నో వేలిచ్చినదాని కన్న నీ తలిదండ్రులకు గౌరవమునిచ్చును. కావున జాగ్రత్తగా నడుచుకొనుము.

**వాణియు శర్వాణియు హరి**
**రాణియు వాక్కునను మై ః నురంబున నుంటల్**
**రాణిcదిలకించి మదిలో**
**బాణిగ్రాహియెడ నిల్పు ః భక్తి కుమారీ!**

**<u>భావము:</u>** సరస్వతి వాక్కునందును, పార్వతి శరీరమందు సగభాగమును, లక్ష్మి వక్షమందు ఉండి ఎప్పుడును బాయక సేవలు చేయుటెరిగి నీవును అట్లెబాయక సేవ చేయుచుండుము.

**తలవాకిట నెల్లప్పుడు**
**నిలువcగరాదెప్పుడెంతఃనిద్దురయైనన్**
**మెలcకువ విడరాదు సుమీ**
**తలనడచుచు విప్పికొనుట తగదు కుమారీ!**

**<u>భావము:</u>** వీధి గుమ్మము వద్ద నిలుచుట, మెలకువ లేక గాఢ నిద్ర పోవుట, మార్గమందు తలతిప్పుట కూడనిపనులు.

**విసువగు పని తగిలినయెడఁ**
**గసరకు సేవకుల మిగులఁ౾ గాంతునితోడన్**
**రొసరొస పూసకు మాడకు**
**మసత్యవచనంబు లెన్నఁడైన కుమారీ!**

**<u>భావము:</u>** ఏదైనా పని ఉన్నప్పుడు విసుగుకొనరాదు. నీ పరిచారికలను తిట్టకుము. మగనితో కలహింపకుము. ఏనాఁడును అబద్ధము లాడకుము.

**కొన్నాళ్లు సుఖము కష్టము**
**కొన్నాళ్లు భుజింపకున్నఁ: గొరగాదు సుమీ**
**పున్నమ దినముల వెన్నెల**
**యెన్నంగ సమాసలందు ౾ నిరులు కుమారీ!**

**<u>భావము:</u>** కొన్నాళ్లు వెన్నెల, కొన్నాళ్లు చీకటి యెట్లు స్వభావమో, అట్లే మనకు కష్టసుఖములు కావడి కుండలు వంటివి. గాక నీకు లేమి సంభవించినను కష్టముగా నెంచకొనక ఓపిక పట్టితివేని సుఖమొనగూడను.

**సరుకులు బట్టలు వన్నెల**
**కరువులు తేఁదగదు తెచ్చె; నేనిసరకుల**
**క్కర దీర్చుకొనన వెంటనే**
**మరలింపకమున్నఁదప్పు;మాట కుమారీ!**

**<u>భావము:</u>** బడాయికి ఎవరివైనా నగలను, బట్టలను అరువు తేకూడదు. నీకు ఉన్నదొక ముక్కు పుల్లకంటే అరువు తెచ్చిన కాసుల పేరైనను గైరవము కాదు. ఒకవేళ అరువు తెచ్చినా కూడా దానిని వెంటనే ఇచ్చివేయకపోతే ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

**ధనవంతుఁడైన యప్పుడుఁ**
**పెనిమిటి చిత్తం బెఱింగి పెండ్లాము మెలం**
**గును లేమి మెలఁగ నేర్చిన**
**వనితకు లోకమున వన్నె వచ్చుఁగుమారీ!**

**భావము:** భర్త ధనవంతుడైనప్పుడు భార్య అణకువతో భర్త మనసు ఎరిగి ప్రవర్తించును. ఇది సహజము. కాని భర్త దరిద్రుడైననూ చులకన చేయక భర్త మనసునకు అణుకవగా గృహిణి ప్రవర్తించ వలయును. అట్లు మెలగెడి గృహిణికి కీర్తి కలుగును.

**తెచ్చిన తేకుండిన నీ**
**కిచ్చిన నీకున్న మగని నెగ్గాడకుమీ!**
**ఒచ్చెము నీపై తేలును**
**రచ్చలకామాట లెక్కురవ్వ కుమారీ!**

**భావము:** నీవు కావాలన్నది నీ భర్త తెచ్చినా తేకపోయినా నీవు అడిగినది ఇచ్చినా ఇవ్వకపోయినా విసవిసలాడకు. ఏమీ అనకు! ఏమైనా అన్నావో లోకం తిట్టి దిగనాడుతుంది. అలాంటి తగవు తెచ్చుకోకు.

**ఆటలఁబాటలలోనే**
**మాటయు రాకుండఁదండ్రి; మందిర మందున్**
**బాటిల్లు కాపురములో**
**వాటమెఱిఁగి బాల తిరుగ; వలయు కుమారీ!**

**భావము:** ఆటపాటలయందు పుట్టింటి వద్ద గానీ యత్తింటి వద్ద గానీ నిష్ఠూరములు రాకుండా బహు జాగ్రత్తగా నడుచుకొనుము.

**తరువులతి రస భార గురుత గాంచు**
**నింగి వ్రేలచు నమృత మొసంగు మేఘు**
**డుద్ధతులుగారు బుధులు సమృద్ధిచేత**
**జగతి నుపకర్తలకు నిది సహజ గుణము**

**భావము:** పండ్ల బరువు వలన చెట్లు వంగుతాయి. ఆకాశంలో వేలాడుతూ మేఘం వర్షాన్ని ఇస్తుంది. సంపద ఎంత ఉన్నా ఉత్తములు గర్వపడరు. ఇతరులకు ఉపకారం చేసేవారికి ఇవి సహజ గుణములు.

**విద్యనిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్**
**విద్య యశస్సు, భోగకరి, విద్య గురుండు విదేశ బంధుఁడన్**
**విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్,**
**విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగని వాడు మర్త్యుడే?**

**భావము:** విద్య అనేది మనం రహస్యంగా దాచిపెట్టుకున్న ధనము వంటిది. అంటే మీరు చదువుకున& వారైతే మీ దగ్గర గుప్తధనం ఉన్నట్టే. మీ చదువే మీకు గుప్త ధనం అన్నమాట. మానవులకు అందాన్ని ఇస్తుంది విద్య. అది కీర్తిని సుఖాన్ని ఇస్తుంది. విద్యయే గురువు. విదేశాలలో బంధువు, దైవం కూడా విద్యయే. ఈ భూమి మీద విద్యకు సాటి అయిన ధనం ఏదీ లేదు. సలకులచేత పూజింపబడేది విద్య. విద్యరాని వాడు మనిషా? కాదు అని అర్థం.

**ఆరంభించరు నీచ మానవులు విఘ్నాయన సంత్రుస్తులై**
**ఆరంభించిఁబరిత్యజింతుదురు విఘ్నాయత్తులై మధ్యముల్,**
**ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై**
**ప్రారబ్ధార్థము లుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్.**

**భావము:** ఆటంకాలకు శ్రమకు భయపడి నీచుల్ ఏ కార్యాన్ని మొదలు పెట్టరు. కార్యాన్ని మొదలు పెట్టి విఘ్నాలు కలిగితే వదిలి పెట్టే వారు మధ్యములు. ధీరులు, తెలివిగలవారు కాబట్టి ఎన్ని విఘ్నాలుకలిగినా ధైర్యంతో గొప్ప ప్రయత్నం చేసి మొదలు పెట్టిన దానిని వదలక పూర్తి చేస్తారు.

**మహనీయుఁడైన గాంధియు**
**మహమదు బుద్ధుఁడును క్రీస్తు మంచినె చెప్పెన్**
**సహజముగ బుద్ధి హీనులు**
**నిహరింపరు బోధలెణింగి పృధిని బాలా!**

**<u>భావము:</u>** గొప్పవారైనమహాత్మాగాంధీ, మహమ్మదు, బుద్ధుడు, క్రీస్తు వంటి వారు మంచినే బోధించిరి. కానీ స్వభావ సిద్ధముగా బుద్ధిలేని వారు వారి బోధలు గ్రహించి నడువరు.

**మన దేశాభ్యున్నతికై**
**తన సర్వస్వంబు ప్రజలకు దానమొసగుచున్**
**వెనుకంజ లేక పోరిన**
**ఘనుఁడు మన ప్రకాశమట్లు కావలె బాలా!**

**<u>భావము:</u>** మన దేశ శ్రేయస్సునకై తన సమస్తమునుత్యాగము చేసి వెనుకడుగు వేయక దీక్షతో పోరాడిన టంగుటూరి ప్రకాశము వలె దేశ భక్తుడవు కావలెను.

**బ్రతికినన్ని వాళ్ళు ఫలములిచ్చుటెగాదు**
**చచ్చికూడా చీల్చి ఇచ్చు తనువు**
**త్యాగ భావమునకు తరువులే గురువులు**
**లలిత సుగుణజాల! తెలుగు బాల!**

**<u>భావము:</u>** చెట్టు జీవించి ఉన్నంతకాలం పండ్లనిస్తుంది. చనిపోయిన తర్వాత కూడా ఉపయోగపడుతుంది. కాబట్టి త్యాగానికి చెట్లే ఆదర్శం.